బుధవారం
07-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 47
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసు సీఐడీకి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసును సీఐడీకి అప్పగిస్తూ ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం ఉత్తర్వులు జారీజేశారు. గత నెల 21వ తేదీ రాత్రి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ ఫైళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలపై 9 కేసులను పోలీసులు నమోదు చేశారు. ఇక నుంచి ఈ కేసును సీఐడీ అధికారులు విచారించనున్నారు.

ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ ఎత్తివేయాలి

ప్రతిపక్ష ఎంపీల నిరసన

న్యూఢిల్లీ: జీవిత బీమా, ఆరోగ్య బీమా పై 18% జీఎస్టీ విధించడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా ఐక్యసంఘటనకు చెందిన ఎంపీలు మంగళవారం పార్లమెంటు వెలుపల ఆందోళన చేశారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందు ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఉన్న 18 శాతం జీఎస్టీని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ భవనం మకర ద్వారం ముందు ప్లకార్డులను

- మిగతా 2 లో

ప్రతి పైసా దోచేస్తోన్న కేంద్రం

ఎంపీ అమర్ సింగ్

న్యూఢిల్లీ: వేతనజీవులు, సామాన్యుల నుంచి ప్రతి పైసాను దోచుకోవడమే కేంద్రప్రభుత్వ ఉద్దేశమని కాంగ్రెస్ ఎంపీ అమర్ సింగ్ వ్యాఖ్యానించారు. సామాన్యుల జేబులకు చిల్లులు పెట్టే అధిక ధరలు, నిరుద్యోగం గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. లోక్‌సభలో మంగళవారం ఆర్థిక బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా

- మిగతా 2 లో

యూ ట్యూబ్ అకాడమీకి కృషి

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ఆ మేరకు కంపెనీ ప్రతినిధులతో చర్చించినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని ఆయన ట్వీట్ చేశారు. ప్రపంచస్థాయి టెక్ దిగ్గజ సంస్థలను, పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్, గూగుల్ ఏపీఏసీ

- మిగతా 2 లో

ప్రాథమిక పాఠశాలలకు ఎసరు?

- పది మంది లోపు విద్యార్థులుంటే మూత
- ఒక్క కడపలోనే 302 పాఠశాలలు గల్లంతు!
- ఉపాధ్యాయ సంఘాల వ్యతిరేకత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పది మంది లోపు విద్యార్థులున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. సర్దుబాటు సాకుతో ఈ తరహా చర్యలకు ఉపక్రమించడంపై సర్వత్రా

- మిగతా 2 లో

ఆ ఆలోచన అనాలోచితం ఎస్టీయూ

2లో

హాస్టళ్లలో మౌలిక వసతుల కోసం

ఉద్యమించిన విద్యార్థిలోకం

నినాదాలతో మార్మోగిన కలెక్టరేట్లు

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యాన విద్యార్థులు ఉద్యమించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల వసతి గృహలోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతోపాటు జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో మంగళవారం వివిధ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

8లో

ఎగనామం!

- 'విద్యాంజలి' పక్కదోవ
- 8 నెలలుగా ఉద్యోగులకు అందని వేతనాలు
- రూ.లక్షల్లో కాజేసిన స్వచ్ఛంద సంస్థలు
- సంబంధం లేదంటున్న విద్యాశాఖ

విశాలాంధ్ర-లింగపాలెం: విద్యావ్యవస్థలో ప్రజలను భాగస్వాములు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2021లో ప్రవేశపెట్టిన విద్యాంజలి పథకం అమలుపై ఎన్నో అనుమానాలు నెలకొన్నాయి. ఈ పథకంలో ఏం జరుగుతోంది... ఇప్పటివరకు ఏం జరిగింది అనే విషయంలో అయోమయం నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరాన్ని బట్టి ఉద్యోగులను నియమించుకునేందుకు, సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు అనుమతులు ఇస్తూ పాఠశాలల అభివృద్ధి కోసం కేంద్రం ఈపథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ పథకం ఉన్నట్లు చాలామందికి తెలియదు. తెలిసినవాళ్లు ఈ పథకాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేసే అధికారాన్ని కేంద్రం విద్యాంజలి పథకం ద్వారా సమాజసేవ చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి అనుమతులు ఇచ్చింది. ఆయా పాఠశాలల్లో నియామకాలు చేపట్టిన స్వచ్ఛంద సంస్థలే ... ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలి. కొన్ని సంఘటనలు పరిశీలిస్తే ... ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకపోగా... ఉద్యోగాలు పేరిట పోస్టును బట్టి లక్షల కాజేసిన సంఘటనలు లింగపాలెం మండలంలో వెలుగు చూశాయి. విద్యాంజలి ద్వారా ఉద్యోగాల్లో చేరిన వారికి ఎనిమిది నెలలుగా వేతనాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. వేతనాల సంగతి దేవుడెరుగా... తాము ముందుగా చెల్లించిన లక్షల రూపాయలను తిరిగి ఇవ్వటం లేదని వాపోతున్నారు. తాము చెల్లించిన డబ్బును

- మిగతా 2 లో

విద్యుత్ విధానాన్ని శాసించేది అదానీనా !

- భారత్‌కు బొగ్గు దిగుమతులు ఆగేదెప్పుడు
- రాజ్యసభలో సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

న్యూఢిల్లీ: బొగ్గు దిగుమతులు ఆగేది ఎప్పుడు? విద్యుత్ విధానాన్ని అదానీ సంస్థ శాసిస్తోందా? అని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎంపీ సంతోశ్ కుమార్ ప్రశ్నించారు. పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడంలో విరుద్ధమైన వైఖరిని కేంద్రం అనుసరిస్తోందని విమర్శించారు. కొత్త, పునరుత్పాదక ఇంధన శాఖ (ఎంఎన్ఆర్ఈ)పై రాజ్యసభలో మంగళవారం జరిగిన చర్చ సందర్భంగా ప్రభుత్వ తీరును సంతోశ్ కుమార్ దుయ్యబట్టారు. ఒక వైపు కొత్త, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం గురించి మాట్లాడుతోన్న సర్కార్... మరోవైపు సంప్రదాయ పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోందని అన్నారు. 'ఇప్పటికే పవర్

- మిగతా 2 లో

నాయకత్వానికి సిద్ధం

మహమ్మద్ యూనుస్ ప్రకటన



మాస్కో/ఢాకా: బంగ్లాదేశ్ పరిపాలన బాధ్యతలను చేపట్టేందుకు సిద్ధమని నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ ప్రకటించారు. విద్యార్థుల ఆకాంక్ష మేరకు దేశానికి నాయకత్వం వహించడాన్ని గౌరవంగా భావిస్తానని తెలిపారు. 'బంగ్లాదేశ్‌లో చర్యలు అవసరమైతే అందుకు సిద్ధం. నా దేశం, ప్రజల కోసం ధైర్యంగా ముందుకు వెళ్లేందుకు వెనుకాడబోను. స్వేచ్ఛ, పారదర్శకత ఎన్నికలకు పిలుపునిస్తున్నా' అని ఆయనన్నారు. ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకుగాను పార్లమెంటును రద్దు చేసిన తర్వాత అధికార పగ్గాలు చేపట్టేందుకు యూనుస్ ముందుకొచ్చారు. ఇదిలావుంటే సైనిక పాలన లేక సైన్యం మద్దతిచ్చిన ప్రభుత్వాన్ని అంగీకరించబోమని విద్యార్థి ఉద్యమ నేతలు స్పష్టంచేశారు. విద్యార్థులు ఆమోదించిన వారికే అధికారం ఉండాలని నొక్కిచెప్పారు. దేశంలో శాంతి భద్రతల పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్‌కు నహీద్ ఇస్లాం పిలుపునిచ్చారు. అంతర్జాతీయంగా పేరుగాంచిన, అందరి ఆదరణ కలిగివున్న నోబెల్ గ్రహీత డాక్టర్ మహమ్మద్ యూనుస్ ప్రధాన సలహాదారుగా ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థి ఉద్యమానికి దేశంలో జరిగే హింస, ఆలయాలపై దాడులు, లూటీలు, విధ్వంసంతో ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు. 'యాంటీ

- మిగతా 2 లో

హసీనా లండన్‌యానం కష్టమే! 2లో

'బంగ్లా' భారతీయులకు రక్షణ: సీపీఐ డిమాండ్ 2లో

కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలం, సాగర్ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

2లో

ఇదీ లోకం!

హమ్మయ్యా మనకు తీవ్రప్రమాదం తప్పింది, జనాగ్రహం 'పదకొండు'తో ఆగింది!

పరిపాలన మార్పు దిశగా బంగ్లాదేశ్

పార్లమెంటు రద్దు... ఖలీదా జియా విడుదల

ఢాకా: బంగ్లాదేశ్‌లో పరిపాలన మార్పు దిశగా చర్యలు వేగవంతమయ్యాయి. ఇప్పటికే ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రాజకీయ వర్గాలతో సంప్రదింపులు జోరందుకున్నాయి. ఆపద్ధర్మ ఏర్పాటు చేసేందుకుగాను అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ మంగళవారం పార్లమెంటును రద్దు చేశారు. జనవరి 7న జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత ఏర్పాటైన 12వ పార్లమెంటును రద్దు చేస్తూ ఆదేశాలిచ్చారు. అంతకుముందు త్రివిధ దళాధిపతులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థి నాయకులతో అధ్యక్షుడు చర్చలు జరిపినట్లు స్థానిక మీడియా తెలిపింది. జులై 1 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు అరెస్టుకు గురైన 'కోటా' నిరసనకారుల విడుదల ప్రక్రియ కూడా మొదలైనట్లు పత్రికా ప్రకటన పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో షేక్ హసీనాకు రాజకీయ ప్రత్యర్థి, దేశానికి తొలి మహిళా ప్రధాని ఖలీదా జియాకు గృహ నిర్బంధం నుంచి విముక్తి లభించడం చర్చనీయాంశంగా మారింది. ఆమె తిరిగి రాజకీయాల్లోకి చక్రం తిప్పుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఆగని హింస

బంగ్లాదేశ్‌లోని జషోర్ జిల్లాలో ఒక హోటల్‌పై జరిగిన దాడిలో 24 మంది దుర్మరణం చెందారు. అవామీ లీగ్ ప్రధాన కార్యదర్శి షాహిన్ చక్లాదర్‌కు చెందిన జబీర్ ఇంటర్నేషనల్ హోటల్‌కు అల్లరిమూకలు నిప్పు పెట్టగా 24 మంది సజీవ దహనమైనట్లు స్థానిక మీడియా తెలిపింది. మృతుల్లో ఇండోనేసియా పౌరుడు ఉన్నట్లు పేర్కొంది. 21 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల కారణంగా వందలాది మంది మృతి చెందారు. దీంతో ఇప్పటి వరకు మరణాల సంఖ్య 440కి చేరుకుంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సైన్యం తీవ్రంగా యత్నిస్తోంది.

అదనపు అటార్నీ జనరల్ రాజీనామా

బంగ్లాదేశ్ అదనపు అటార్నీ జనరల్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు న్యాయవాది ఎస్‌కే మహమ్మద్ ముర్షద్ వెల్లడించారు. వ్యక్తిగత సమస్యలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను అధ్యక్షుడికి అందజేశారు. వ్యక్తిగత సమస్యలు, అనారోగ్యం కారణంగా రాజీనామా చేస్తున్నట్లు లేఖలో ముర్షద్ పేర్కొన్నట్లు డైలీ స్టార్ నివేదించింది.

హసీనాకు భారత్ సహకారం

షేక్ హసీనా రాజకీయ శరణార్థిగా బ్రిటన్ ఆశ్రయం కోరారు. బ్రిటన్ ప్రభుత్వ అనుమతులు వచ్చేవరకు ఆమె భారత్‌లో ఉండనున్నారు. ఇందుకోసం న్యూదిల్లీ తాత్కాలిక అనుమతులు ఇచ్చింది. హసీనాకు సంస్థాగతంగా సహకారాన్ని అందిస్తోంది. బంగ్లాదేశ్ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తోంది. భద్రతా దళాలు గగనతలంపై నిఘా వేశాయి. అటువైపు నుంచి వచ్చే విమానం భారత్‌లోకి సురక్షితంగా ప్రవేశించేలా చూడాలని నిర్ణయించాయి. ఇదే క్రమంలో భారత్ గగనతలంలోకి ప్రవేశించినప్పుడు షేక్ హసీనాకు రఫేల్ యుద్ధవిమానాలు రక్షణ కల్పించాయి. పశ్చిమ బెంగాల్‌లోని హసీమారా వైమానిక స్థావరం నుంచి వెళ్లిన 101 స్క్వాడ్రన్ రఫేల్ విమానాలు... షేక్ హసీనా విమానం ఉత్తరప్రదేశ్‌లోని హిండన్ విమానాశ్రయంలో దిగే వరకు వెంట వెళ్లాయి. ఈ పరిణామాలన్నింటినీ భారత త్రివిధ దళాధిపతులు నిశితంగా గమనించారని సమాచారం. విమానాశ్రయంలో హసీనాకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ స్వాగతం పలికారు. అనంతరం ఆమెతో గంటసేపు చర్చించారు. భవిష్యత్ కార్యాచరణ గురించి తెలుసుకున్నారు.

ఐరాస దర్యాప్తునకు బ్రిటన్ సూచన

బంగ్లాదేశ్ పరిస్థితులను బ్రిటన్ నిశితంగా గమనిస్తోంది. ఈ పరిణామాలపై ఐక్యరాజ్య సమితి (ఐరాస్) అధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని సూచన చేసింది. బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ శాంతియుతంగా సాగాలని కోరుకుంటున్నట్లు బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి ఒక ప్రకటన చేశారు. షేక్ హసీనా తమ దేశంలో రాజకీయ శరణార్థిగా ఆశ్రయం కోరడం గురించి ప్రస్తావించలేదు. హసీనా సోదరి రెహానా బ్రిటన్ పౌరురాలు కాగా ఆమె కుమార్తె తులిప్ సిద్దీఖీ లేబర్ పార్టీ ఎంపీ. బ్రిటన్‌లో లేబర్ పార్టీనే అధికారంలో ఉంది.

అమెరికాలో జియా మద్దతుదారుల వీరంగం

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) మద్దతుదారులు న్యూయార్క్‌లోని బంగ్లాదేశ్ కాన్సులేట్‌లో వీరంగం సృష్టించారు. మాజీ ప్రధాని ఖలీదా జియాపై అభిమానాన్ని చాటుకున్నారు. కాన్సులేట్‌లోకి చొరబడి షేక్ హసీనా తండ్రి, మాజీ అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ చిత్రపటాలను తొలగించారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. బంగ్లాదేశీ జెండాలను తలకు చుట్టుకొని... అధికారులను లెక్క చేయకుండా కాన్సులేట్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించిన దృశ్యాలు ఆ వీడియోలో కనిపించాయి.

'బంగ్లా' భారతీయులకు రక్షణ: సీపీఐ

న్యూదిల్లీ: బంగ్లాదేశ్‌లోని భారత పౌరులకు రక్షణ కల్పించేందుకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పిలుపునిచ్చింది. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతను పరిరక్షించాలని కేంద్రప్రభుత్వానికి సూచించింది. బంగ్లాదేశ్ పరిస్థితులపై ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనను సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం విడుదల చేసింది. ప్రజా ఉద్యమాన్ని చాంధస, అరాచక శక్తులు చేజిక్కించుకొని... ఎవరి నాయకత్వంలో బంగ్లాదేశ్ ఏర్పడిందో ఆ వంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ విగ్రహాన్నే ధ్వంసం చేశాయని, బంగ్లాదేశ్ విమోచన పోరాట సమ్మిళిత వారసత్వాన్ని ధిక్కరించాయని, ఇలాంటి చర్యలను సీపీఐ ఖండిస్తోందని ప్రకటన పేర్కొంది. చాందస-అరాచక శక్తుల ఆగడాలను బంగ్లాదేశ్‌లోని వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు, దేశభక్తులు కొనసాగనివ్వబోమని విశ్వసిస్తున్నట్లు వెల్లడించింది. 'బంగ్లాదేశ్ ప్రస్తుతం సైన్యం చేతుల్లోకి వెళ్లింది. ఆపద్ధర్మ ప్రభుత్వం దేశాన్ని నడుపుతుందని అధినేత ప్రకటించారు. శాంతి భద్రతలను పునరుద్ధరించడమే కాక మైనారిటీల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు హామీనిచ్చే ప్రభుత్వం ఏర్పడుతుందని సీపీఐ ఆకాంక్షిస్తోంది. భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తుందని, గతంలో వలే భారత్ వ్యతిరేక ఉగ్ర సంఘాలకు తమ భూభాగాన్ని వాడుకకు ఇవ్వబోదని పార్టీ నమ్ముతోందని ప్రకటన పేర్కొంది.

నాయకత్వానికి సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

డిస్క్రిమినేషన్ స్టూడెంట్ మూవ్‌మెంట్' నేతృత్వంలో ప్రభుత్వాస్తులు, మత సామరస్యాన్ని పరిరక్షించే కమిటీ ఏర్పాటు చేశాం. ఈ కమిటీ స్థానికులకు రక్షణ కల్పిస్తుంది. మైనారిటీలను, ప్రభుత్వ ఆస్తులను, దేశాన్ని కాపాడుకుందాం' అని నహీద్ ఇస్లాం పిలుపునిచ్చారు.

మహ్మమద్ యూనస్ ఎవరు

మహమ్మద్ యూనస్ పేరును విద్యార్థి నేతలు ప్రతిపాదించగా సైన్యాధికారి అంగీకరించినట్లు తెలిసింది. యూనస్ 1940లో బంగ్లాదేశ్‌లోని చిట్టాగాంగ్‌లో జన్మించారు. సామాజిక కార్యకర్తగా, ఆర్థికవేత్తగా పేరుగాంచారు. మైక్రోఫైనాన్స్ బ్యాంక్ ద్వారా లక్షలాది మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చి ఘనత సాధించారు. దీంతో 2006లో నోబెల్ శాంతి పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే 2009లో యునైటెడ్ స్టేట్స్ ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్, 2010లో కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్ సహా అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కించుకున్నారు. 2012-18 వరకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గో కాలెడోనియన్ యూనివర్సిటీకి ఛాన్సలర్‌గా పని చేశారు. చిట్టగాంగ్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా గతంలో పని చేశారు.

హసీనా లండన్‌యానం కష్టమే!

రక్షణ పొందిన మొదటి దేశంలోనే ఆశ్రయం: బ్రిటన్ హోం శాఖ

తాత్కాలిక ఆతిథ్యానికే భారత్ మొగ్గు

ఢాకా: రాజకీయ శరణార్థిగా బ్రిటన్ వెళ్లేందుకు బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ప్రయత్నాలు ఫలించడం లేదన్న సంకేతాలు వెలువడ్డాయి. ముందు రక్షణ పొందిన దేశంలో ఉండటమే మేలు అంటూ బ్రిటన్ పరోక్షంగా భారత్‌లో ఆశ్రయం పొందాలని ఆమెకు సూచించింది. భారత్ కూడా నేరుగా ఆశ్రయం కల్పిస్తామని ఇప్పటివరకు ప్రకటించలేదు. వేచిచూద్దామనే ధోరణిని అనుసరిస్తోంది. భారత్ ప్రస్తుతం దౌత్యపరమైన గందోళ గోళ పరిస్థితుల్లో ఉన్నది. బంగ్లాదేశ్ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని విదేశాంగ మంత్రి జైశంకర్ వెల్లడించారు. తన భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడేందుకు షేక్ హసీనాకు భారత్ ఇచ్చిందని సమాచారం. అంటే హసీనాకు సహకరిస్తోంది కానీ 1970 తరహాలో శాశ్వత అతిథిగా అంగీకరించబోదన్న సంకేతాలు అందుతున్నాయి. బంగ్లాదేశ్ పరిస్థితులు క్షీణించిన సమయం నుంచి ఆమె లండన్‌కు వెళ్తారన్న ఊహాగానాలు ఉన్నాయి. హసీనా సోదరి రెహానా బ్రిటన్ పౌరురాలు కాగా ఆమె కుమార్తె తులిప్ సిద్దీఖీ లేబర్ పార్టీ ఎంపీ కావడంతో బ్రిటన్‌లో ఆశ్రయం పొందాలని బంగ్లాదేశ్ ప్రధాని భావించారు. ప్రస్తుతానికి బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలో ఉన్నది. అయితే తమ దేశానికి తాత్కాలిక శరణార్థిగా రావాలంటే వలస చట్టాలు ఒప్పుకోవని బ్రిటన్ హోంశాఖ అధికారి వెల్లడిం చారు. ఆశ్రయం కోరే వారికి రక్షణ కల్పించేం దుకు గర్వపడే రికార్డు మా సొంతమే అయినా తాతాల్కిక శరణార్థులకు ఆశ్రయం కల్పించలేమని పేర్కొన్నారు. 'అంతర్జాతీయ రక్షణ అవసరమైన వారు... ముందుగా ఆశ్రయం పొందిన 'సురక్షిత' దేశంలోనే ఉండాలి. రక్షణ పొందేందుకు వేగవంతమైన మార్గమదే'నని బ్రిటన్ హోంశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. అంటే భారత్‌లో ఆశ్రయం పొందమని షేక్ హసీనాకు బ్రిటన్ చెప్పకనే చెప్పింది. ఇదిలావుంటే ఆశ్రయం కల్పించాలన్న షేక్ హసీనా దరఖాస్తు పరిశీలనలో ఉన్నట్లు కొన్ని వర్గాలు పేర్కొన్నాయి.

కృష్ణమ్మ పరవళ్లు

విశాలాంధ్ర-విజయపురిసౌత్/కర్నూలు: ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణా నదికి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 22 రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువగల శ్రీశైలం జలాశయం నుంచి 10 గేట్లు 12 అడుగుల మేర ఎత్తి దిగువకు 4,03,455 క్యూసెక్కుల వరద నీటిని స్పిల్‌వే మీదుగా విడుదల చేశారు. కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 64745 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 585.40 అడుగుల (298.3895 టీఎంసీలు)కు చేరగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు నిరాడంబరంగా నీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారం ముందుగా 6 గేట్లు, అనంతరం 10 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయగా మంగళవారం ఏకంగా 22 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుదుత్పాదన ద్వారా 28,907 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా మొత్తం 1,47,755 క్యూసెక్కుల వరద నీరు దిగువ కృష్ణానదిలోకి విడుదలవుతుంది. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రొటోకాల్ ప్రకారం ఎగువ నుంచి వచ్చే వరదను బట్టి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ జలాశయానికి డ్యామ్ సైట్‌లో ఇన్ఫ్లో 3,54,831 క్యూసెక్కులు నమోదవుతుండగా కుడి, ఎడమ కాల్వలతో పాటు ఎస్ఎల్‌బీసీ, వరద కాల్వలతో కలిపి మొత్తం సాగర్ జలాశయం నుంచి ఔట్ ఫ్లోగా 3,14,761 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సాగర్ జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు. 312.5050 టీఎంసీలకు సమానం. అయితే మూడేళ్లుగా సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోకపోవడం, ఈ ఏడాది పైనుంచి భారీగా వరద నీరు వచ్చి సాగర్ జలాశయానికి చేరుకోవడంతో రిజర్వాయర్ గరిష్ఠ స్థాయికి చేరువలో ఉండడంతో దిగువ ప్రాంత రైతాంగం హర్షం వ్యక్తం చేస్తుండగా, క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటిని చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. మరోవైపు శ్రీశైలం జలాశయానికి కూడా వరదనీరు పోటెత్తుతోంది. మంగళవారం 10 గేట్ లు 12 అడుగుల మేర ఎత్తి దిగువనున్న సాగర్ కు 4,03,455 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. పోతిరెడ్డిపాడుకు 25000,మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తి పోతల పథకం ద్వారా 2400 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు. కుడి, ఎడమ గట్టు విద్యుత్ ఉత్పత్తి కి 64745క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తున్నారు.. శ్రీశైలం జలాశయానికి ఎగువ నున్న జూరాల, సుంకేసుల నుంచి 3,38,340 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం జలాశయంలో 883 అడుగుల నీరు ఉంది. జలాశయం నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 212.387 టీఎంసీల నీరు ఉంది.

ప్రాథమిక పాఠశాలలకు ఎసరు?

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకత నెలకొంది. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే... ఎలాంటి చర్చలు జరపకుండా ఏకపక్ష నిర్ణయాలకు సిద్ధమవ్వడాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గతంలో 117 జీవో రద్దు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... దానికంటే అధికంగా నష్టం చేసే చర్యలకు పాల్పడుతోందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎలాంటి చర్చలు, సంప్రదింపులు చేపట్టకుండా, ఇలా ఏకపక్షంగా నిర్ణయాలకు సిద్ధమవుతున్న తీరును తూర్పారబడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో లక్షా 80 వేల మంది ఉపాధ్యాయులుగా ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కేటగిరీల వారీగా చూస్తే... 6 వేల ఉన్నత పాఠశాలలు, 5 వేల ప్రాథమికోన్నత, 34 వేల ప్రాథమిక పాఠశాలలున్నాయి. 12,683 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు కొనసాగుతున్నారు. దీనికి కారణం గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 విధానాలే. ఈ జీవో 117 ద్వారా 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దాని ప్రభావంతో 4 వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. కేవలం ప్రాథమిక పాఠశాలలను 1,2 తరగతులకే పరిమితం చేశారు. ఈ విధానాలపై నాడు ఉపాధ్యాయ సంఘాలు పెద్దఎత్తున ఉద్యమించాయి. తక్షణమే జీవో 117 రద్దు చేసి, ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని డిమాండ్ చేశాయి. 3,4,5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లోకి పంపడంతో దానివల్ల అక్కడ విద్యార్థులకు వాతావరణం అనుకూలించక అసౌకర్యానికి గురయ్యారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు జీవో 117 రద్దు చేసి, ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాయి. దాని ప్రకారమే ఉపాధ్యాయ వర్గాలు పెద్దఎత్తున కూటమి గెలుపునకు సహకరించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో 117 రద్దుపై మౌనం దాల్చుతోంది. ఇటీవల ముగిసిన శాసన మండలి సమావేశాల్లో జీవో117 రద్దు అంశంపై సభ్యులు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, విద్యాపరమైన అన్ని సమస్యలపై కీలక నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయ సంఘాలతో భేటీ ఏదీ?

ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇంతవరకు భేటీ అవ్వలేదు. వారితో చర్చించకుండా ప్రాథమిక పాఠశాలల విలీనానికి కసరత్తు చేయడాన్ని తప్పుపడుతున్నారు. పది మంది లోపు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తే... ఒక్క కడప జిల్లాల్లోనే 302 ప్రాథమిక పాఠశాలలు మూతపడే అవకాశం ఉంది. ఇక మిగిలిన జిల్లాల్లోనూ లెక్కలు తీస్తున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుంది. ఈ విధానం జీవో 117 కంటే దారుణమైనదని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఉన్న విద్యా రంగ సమస్యలు యథాతథంగా ఉన్నాయి. దీనికితోడు ఇటీవల స్టడీటూర్ పేరుతో ఉపాధ్యాయులను పది రోజులపాటు శిక్షణ తరగతులకు పంపారు. దీంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు దూరమయ్యాయి. ఇలాంటి అంశాలపై ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడాన్ని తప్పుపడుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన యాప్‌ల విధానం ఇంకా కొనసాగడంపై ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంకా విద్యార్థులు, వారికి అందించే సంక్షేమ పథకాల వివరాలను ఉపాధ్యాయులే నమోదు చేస్తున్నారు. గతంలో ఇందుకోసం నాన్ టీచింగ్ సిబ్బందిని పెట్టాలన్న డిమాండ్లు వచ్చినప్పటికీ, దానిపై ఆలోచనలేదు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి పది మంది లోపు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసే ఆలోచనను విరమించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాయి.

ఆ ఆలోచన అనాలోచితం : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పని సర్దుబాటు పేరుతో పది మంది లోపు విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని పాఠశాల విద్యాశాఖ ఆలోచించడం అనాలోచిత నిర్ణయమనీ, వెంటనే ఆ ఆలోచనను ఉపసంహరించుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం-ఆంధ్ర ప్రదేశ్ (ఏపీ-ఎస్టీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం తీసుకున్న కొన్ని అసంబద్ధ నిర్ణయాలతో కొన్నేళ్లుగా ప్రభుత్వ విద్యారంగం బలహీనపడుతోందన్నారు. జీవో 117ను రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని, బోధనేతర పని భారం, యాప్‌లు తగ్గించాలన్నారు. పదవీవిరమణల వల్ల గత జనవరి నుంచి ఏర్పడిన ఖాళీలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నియమించాలని విద్యాశాఖ అధికారులను, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరామన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో త్వరలో చర్చలు జరుపుతామని, చర్చలు జరిపిన తర్వాతనే కార్యాచరణ ప్రకటిస్తామని మంత్రి తెలిపినప్పటికీ...విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినప్పటికీ ఇంతవరకు చర్చలకు పిలవలేదన్నారు. బోధనేతర పనిభారం, పాఠశాల పని దినాల్లో శిక్షణ కార్యక్రమాల నిర్వహణ కొనసాగుతున్నాయని తెలిపారు. జీవో 117 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వలన 1,2 తరగతులకు పరిమితమైన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సింగిల్ డిజిట్‌కు చేరుకునే పరిస్థితి వచ్చిందన్నారు. పది మంది లోపు విద్యార్థులు గల ప్రాథమిక పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను పని సర్దుబాటు పేరుతో ఉన్నత పాఠశాలల్లో నియమించాలన్న నిర్ణయం జీవో 117 కన్నా మరింత నష్టం కలుగచేస్తుందని, దానివలన ప్రాథమిక పాఠశాలలు కుదించబడి, కిలోమీటర్ లోపు ప్రాథమిక పాఠశాల ఉండాలన్న విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడవడమేనని పేర్కొన్నారు. పాఠశాలలు మూసివేయాలన్న ఆలోచన తొలగించి విద్యార్థుల సంఖ్య పెంచడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పక్కనున్న తెలంగాణ రాష్ట్రం కూడ 10మంది విద్యార్థుల వరకు ఒకరు, 11 మంది నుంచి 2వ ఉపాధ్యాయుని నియమిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండానే ఎలాంటి రాత పూర్వక ఆదేశాలు ఇవ్వకుండా పదిమందిలోపు విద్యార్థులు గల ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో దశల వారి ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విద్యుత్ విధానాన్ని శాసించేది అదానీనా !

(మొదటిపేజీ తరువాయి)

బాస్కెట్‌లో బొగ్గువాటా 50శాతంగా ఉంది. బొగ్గు ప్లాంట్ల సామర్థ్యం పెరుగుతోంది. 13.9గిగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అంటే బొగ్గు ఉత్పత్తిని, అదానీని ప్రోత్సహిస్తున్నారు. దీనిని బట్టి విద్యుత్ విధానాన్ని అదానీ సంస్థ శాసిస్తోందా అన్న అనుమానం కలుగుతున్నది' అని సంతోశ్ కుమార్ అన్నారు. రాబోయే సంవత్సరాల్లోనూ బొగ్గు దిగుమతులు కొనసాగుతాయని అదానీ సంస్థ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అలా ఎలా చెప్పగలరు? ఈ పద్ధతిలో బొగ్గు దిగుమతులను ప్రోత్సహించవచ్చా? అని కేరళ ఎంపీ ప్రశ్నించారు. బొగ్గు దిగుమతులను భారత్ నిలిపివేసేది ఎప్పుడని నిలదీశారు. దేశంలో కొత్తగా బొగ్గు ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పుకుంటూ పునరుత్పాదక ఇంధనం గురించి మాట్లాడుతుండటం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. వ్యవహారంలో మంత్రిత్వశాఖ ఆత్మవిమర్శ చేసుకోవడం అవసరమని సంతోశ్ కుమార్ హితవు పలికారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన గురించి ఎన్‌సీపీ ఎంపీ ఫౌజియా ఖాన్ మాట్లాడారు. ఉచిత సౌర విద్యుత్... సబ్సిడీ ఆధారిత పథకమని, ఇందులో ఉచితమేమీ లేదని తెలిపారు. విద్యుత్ సరఫరాకు విఘాతం కలిగే ప్రాంతాల్లో ఉన్న వారికి ఈ పథకం ఉపయుక్తంగా ఉంటుంది కానీ రైతులు ముందుగా బ్యాంకులకు వెళ్లి రుణాల కోసం దరఖాస్తు పెట్టుకోవాలి... ఆ తర్వాతే సబ్సిడీ మంజూరవుతుందన్నారు. బ్యాంకు రుణాలు పొందడం రైతులకు కష్టంగా మారిందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఉచిత సౌర విద్యుత్ పథకం... కాగితాలకే పరిమితమని ఫౌజియా ఖాన్ వ్యాఖ్యానించారు. ఐయూఎంఎల్ సభ్యులు హారిస్ బీరన్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగ వ్యయాన్ని భరించలేని ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా సౌర యోజన ఉండాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వ సహకారాన్ని పెంచాలని సూచించారు. సాధారణంగా ఇంటికి మూడు కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. ఇందుకు లభించే సబ్సిడీ తక్కువని, దాన్ని 50శాతానికి పెంచితే ఉపయుక్తంగా ఉంటుందని హారిస్ బీరన్ అభిప్రాయపడ్డారు. సౌర ప్రాజెక్టుల్లో అరుణాచల్ ప్రదేశ్, లధాక్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఏజీపీకి చెందిన బీరేంద్ర ప్రసాద్ భాష్య కోరారు. ఈ ప్రాంతాల్లో ఏడాది పొడవూ సూర్యరశ్మి పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. మహారాష్ట్రకు మంజూరైన పునరుత్పాదక ప్రాజెక్టుల్లో చాలా ప్రారంభానికి నోచుకోలేదని శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు. తమిళనాడు తీరప్రాంతానికి వాయుశక్తి ఉత్పాదన సామర్థ్యం ఉన్నట్లు ప్రభుత్వ దృష్టికి ఏఐఏడీఎంకే ఎంపీ తంబిదురై తీసుకెళ్లారు. చర్చలో బీజేడీ, బీజేపీ సభ్యులు పాల్గొన్నారు.

ఎగనామం!

(మొదటిపేజీ తరువాయి)

తిరిగి ఇచ్చేస్తే... ఉద్యోగాలను వదులుకుంటామని మొరపెడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఉద్యోగాలు ఇచ్చిన సంస్థల వివరాలు ఉద్యోగులకు ఏమాత్రం తెలియదు. దళారీల ద్వారా డబ్బి చ్చి ఉద్యోగాలలో చేరారు. వేతనం ఇవ్వాలని బాధితులు విద్యాశాఖ అధికారులను కోరుతుంటే... ఇటువంటి ఉద్యోగాల నియామకాలతో తమకు సంబంధం లేదని, ఏ సంస్థద్వారా ఉద్యోగాల్లో చేరారో వారి ద్వారా వేతనాలు పొందాలని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం మంచి లక్ష్యంతో ఈ పథకం ప్రవేశ పెడితే ఇది పక్కదోవ పట్టటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. వీటికి సంబంధించిన వివరాలు విద్యాశాఖ వద్ద కూడా లేవనేది వారి వివరణ. ఉద్యోగ నియామకాలు, వేతనాలు చెల్లింపు అంతా ఆయా సంస్థలే చూసుకోవాల్సి ఉందని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. అయితే అనేక స్వచ్ఛంధ సంస్థలవారు ఇన్ కమ్ టాక్స్ చెల్లిస్తుంటారు. విద్యాంజలి ద్వారా పాఠశాలల్లో ఉద్యోగాలలో నియమించి వారికి వేతనాలు ఇస్తే నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు అవుతుంది. ఇలా చేయడం ద్వారా ఆయా సంస్థలు ప్రతి ఏటా కట్టే టాక్స్ చెల్లింపులో రాయితీ ఉంటుంది. కానీ కొందరు ఫేక్ సంస్థలను సృష్టించి నిరుద్యోగుల వద్ద డబ్బు గుంజి వేతనాలు ఇవ్వకుండా ఎగనామం పెట్టారనే ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయిస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయనేది యథార్థం. పాఠశాలల వారీగా డేటాను సేకరిస్తే వివరాలు తెలుసుకోవడం కష్టం కాదు. దీనివల్ల ఎంతమంది ఇటువంటి ఉద్యోగాల్లో చేరారో, వేతనాలు లేక ఎంతమంది అవస్థలు పడుతున్నారో, డబ్బు చెల్లించి నష్టపోయిన వారి వివరాలు తెలుస్తాయి. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో వివరాలు సేకరించి మోసాలకు పాల్పడిన వారిని గుర్తించవచ్చు. వారిపై చర్యలు తీసుకొని డబ్బు పోగొట్టుకున్న వారికి ఇప్పించే అవకాశం ఉంటుంది. అధికారుల అజమాయిషి ఉండటం వల్ల పథకం సక్రమంగా అమలవుతుంది.

ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ ఎత్తివేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రదర్శించారు. ఈ ఆందోళనలో రాహుల్ గాంధీతో పాటు ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కూడా పాల్గొన్నారు. తెలంగాణ నుంచి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ... నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులపై భారం మోపేలా ఉందన్నారు. పేద వారిని దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన బడ్జెట్ కాదని విమర్శించారు. అంబానీ, అదానీలకు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హెల్త్, లైఫ్ ఇన్సూరెన్సులపై విధించిన 18% జీఎస్టీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎంసీ నేత డెరిక్ ఒబ్రెయిన్ సోమవారం ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తిన విషయం తెలిసిందే. అధిక పన్ను ప్రజలకు భారంగా మారుతున్నట్లు తెలిపారు. రాజ్యసభలో జీరో అవర్‌లో ఆయన మాట్లడారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఇదే రకమైన డిమాండ్ చేసినట్లు ఆయన ఆర్థిక మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని, ఆర్థిక మంత్రి కనీసం రోడ్డు, రవాణా శాఖ మంత్రి గడ్కరీ వ్యాఖ్యలను అయినా ఆలకించాలని టీఎంసీ ఎంపీ తెలిపారు.జీఎస్టీ మండలి మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకుంటుందని ప్రభుత్వం చెప్పిన విషయాన్ని ఎంపీ ఒబ్రెయిన్ తిరస్కరించారు. ఆ వాదనలో వాస్తవం లేదన్నారు. మండలిలో ఎన్డీఏకు మెజారిటీ ఉన్నదని, కావాలంటే దీన్ని మార్చవచ్చు అని తెలిపారు.

యూ ట్యూబ్ అకాడమీకి కృషి

(మొదటిపేజీ తరువాయి)

హెడ్ సంజయ్ గుప్తాతో వర్చువల్‌గా సమావేశమైనట్లు వివరించారు. వారిద్దరితో ఆన్ లైన్ వేదికగా తాను భేటీ కావడం ఆనందంగా ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లను ప్రోత్సహించేందుకు స్థానిక భాగస్వాముల సహకారంతో ఈ అకాడమీ ఏర్పాటుపై చర్చించామని వివరించారు. అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయబోయే మీడియా సిటీకి సాంకేతిక సహకారం అందించే అవకాశాల పైనా వారితో చర్చించినట్లు సీఎం ట్వీట్‌లో వివరించారు.

ప్రతి పైసా దోచేస్తోన్న కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

అమర్ సింగ్ మాట్లాడుతూ పేదలపై పన్ను భారాన్ని మోపి సంపన్నులకు మినహాయింపులు ఇచ్చేదిగా బడ్జెట్ ఉందన్నారు. ప్రభుత్వం పనిచేస్తున్నది ఎవరి కోసమంటూ ప్రశ్నించారు. పన్ను స్లాబులను దుయ్యబట్టారు. 70శాతం ఐటీ రిటర్న్‌లో పన్ను శూన్యమని, రూ.5లక్షల వరకు ఆదాయానికి మినహాయింపు ఇస్తే వినియోగం పెరిగి పేదరికం తగ్గుతుందని ఆర్థికమంత్రికి సలహా ఇచ్చారు. కార్పొరేట్లకు ఇచ్చిన మినహాయింపుల వల్ల ఉపాధి కల్పన జరిగిందా అని ప్రశ్నించారు. ఉపాధి/ఉద్యోగావకాశాల కల్పన లేనప్పుడు మినహాయింపులు ఇవ్వడం సముచితం కాదని హితవు పలికారు. వ్యవసాయంపై 50శాతం జనాభా ఆధారపడుతోందని, ఈ లెక్కన 18శాతం ఆదాయంపైనే సగం జనాభా మనుగడ సాగిస్తోందని, అందుకోసమే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు ఆందోళనలకు దిగుతున్నారని అమర్ సింగ్ అన్నారు.

'మౌలిక' ప్రాజెక్టులు నిర్వీర్యం

- గత ప్రభుత్వం కక్షపూరితంగా నిలిపివేసింది
- మళ్లీ వాటిని పట్టాలెక్కించాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాటి తెలుగుదేశం ప్రభుత్వ (2014-19) హయాంలో చేపట్టిన అనేక ప్రతిష్ఠాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కక్ష పూరితంగా రద్దు చేసిన, నిలిపివేసి అన్ని ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు-పెట్టుబడుల శాఖపై మంగళవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులను నిలిపివేసి సంపద సృష్టి కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని, మళ్లీ ఆ ప్రాజెక్టులు గాడిన పెట్టి...త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వ రివర్స్, అసమర్థ పాలనతో 9 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు 5 లక్షలకు పడిపోయాయని, వాటిలో కూడా నాణ్యమైన సేవలు అందించలేదన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కంటెంట్ కార్పొరేషన్, డ్రోన్ కార్పొరేషన్, ఏపీ టవర్స్ కార్పొరేషన్, గ్యాస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌లనూ మళ్లీ గాడిలో పెట్టి సేవలు పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వివాదాలకు తావు లేకుండా అన్ని పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఏపీ మారిటైం మాస్టర్‌ప్లాన్‌తో పాటు మారిటైం పాలసీ తీసుకువస్తామన్నారు. నాడు సుదీర్ఘ కసరత్తు చేసి తలపెట్టిన ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో నాడు ప్రతిపాదించిన నెల్లూరు జిల్లా దగదర్తి, చిత్తూరు జిల్లా కుప్పం, పల్నాడు జిల్లా నాగార్జున సాగర్‌లలో ఎయిర్ పోర్టులు, ఎయిర్ స్ట్రిప్‌ల నిర్మాణంతో పాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. గతంలో ఈ ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేయడంతో పాటు భూసేకరణ పూర్తయిందని, అయితే గత ప్రభుత్వం వాటిని నిలిపివేసిందన్నారు. మళ్లీ వీటి నిర్మాణం కార్యరూపం దాల్చాలని ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 12 నుంచి 14 చోట్ల ఎయిర్ పోర్టులు, ఎయిర్ స్ట్రిప్ లు అందుబాటులోకి తేవాలనేదీ తమ ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, కాకినాడజిల్లా తుని ప్రాంతంలోనూ ఎయిర్ పోర్టులు/ఎయిర్ స్ట్రిప్‌లు నిర్మించే అంశంపై పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టుల ద్వారా సరుకు రవాణా చేసేలా ప్రాజెక్టులు రూపకల్పన చేయాలని సూచించారు. ఎయిర్ పోర్టులు, పోర్టులు, నేషనల్ హైవేలు అనుసంధానం చేయడం ద్వారా ఉద్యోగ కల్పనతో పాటు వేగవంత అభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్‌ను జీఏడీ పరిధిలోకి, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌ను ఐ అండ్ పీఆర్ పరిధిలోకి తీసుకురావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏపీ టవర్స్ కార్పొరేషన్‌ను ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్‌లో విలీనం చేయాలన్నారు. ఒక మంచి లక్ష్యంతో నాడు ఏపీ ఫైబర్ నెట్ ప్రాజెక్టును తీసుకొస్తే... దానిపైనా విషం చిమ్మి బంగారం లాంటి ప్రాజెక్టును నాశనం చేశారన్నారు. కరెంట్ స్తంభాల ద్వారా ఫైబర్ నెట్ ఏర్పాటు చేసి కేవలం 10శాతం ఖర్చుతో ప్రాజెక్టును పూర్తి చేశామని, 24 వేల కిలోమీటర్ల మేర ఫైబర్ నెట్ నిర్మాణం చేసి 9 లక్షల కనెక్షన్లు ఇచ్చామని గుర్తుచేశారు. నాడు జిల్లాల్లో నిర్మాణం తలపెట్టిన ఆర్టిజి సెంటర్లు పూర్తిచేయాలని, సీసీ కెమెరా నెట్ వర్క్ ను వీటికి అనుసంధానం చేయాలని చంద్రబాబు సూచించారు.

9న క్విట్ కార్పొరేట్ జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కార్పొరేట్లను తరిమికొట్టాలని, బడా కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో తలపెట్టిన క్విట్-కార్పొరేట్‌ను జయప్రదం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల మార్కెట్‌లో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యాన్ని అరికట్టాలని కోరుతూ క్విట్ కార్పొరేట్ ఉద్యమానికి సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఆ రోజు జిల్లా, మండల కేంద్రాల్లో రైతులు, కౌలు రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు అంతా కలిసి నిరసనల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం పంటల కొనుగోలు నుంచి ఉపసంహరించుకుందని తెలిపారు. బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించిందని, విద్యుత్ ఉత్పత్తి, రవాణా, పంపిణీ సంస్థలను అంబానీ, ఆదానీకి అప్పగించడానికి వీలుగా చట్టాన్ని సవరణ చేసిందన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి బిల్లుల వసూళ్లకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. పంటల బీమా పథకాన్ని ప్రైవేటు కంపెనీలకు ఉపయోగపడేలా చేసిందని, రైతులను నట్టేట ముంచుతోందన్నారు. పై విధానాలన్నీ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసం చేస్తున్నవేనని ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ పేర్కొన్నారు.

శాంతి భద్రతలు అదుపు తప్పాయి

రాష్ట్రపతి పాలనెందుకు విధించకూడదు?: మాజీ సీఎం వైఎస్ జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అరాచక పరిస్థితులతో పూర్తిగా శాంతిభద్రతలు అదుపు తప్పాయని, రాష్ట్రపతి పాలన ఎందుకు విధించకూడదని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం నవాబుపేటలో దుండగుల చేతిలో తీవ్రంగా గాయపడి, విజయవాడ సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ నాయకులు శ్రీనివాసరావు, గోపి, రామకృష్ణను మంగళవారం సాయంత్రం జగన్ పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి దగ్గర మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, పార్టీ నేతలతో కలిసి జగన్ మీడియాతో మాట్లాడారు. నవాబుపేటలో కేవలం ఆధిపత్యం చూపడం కోసం ఒక పథకం ప్రకారం అతి దారుణంగా దాదాపు 20 మంది కలిసి కర్రలతో కొట్టారని జగన్ చెప్పారు. తీవ్ర గాయాలపాలైన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, దీని వల్ల మీరేం సాధిస్తారని చంద్రబాబును నిలదీశారు. చంద్రబాబు ప్రభుత్వం మీద వ్యతిరేకత వేగంగా పెరుగుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి పరిపాలన మీద దృష్టి పెట్టాల్సింది పోయి, ఏం చేస్తున్నాడనేది తనను తాను ప్రశ్నించుకోవాలని కోరారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, రైతులకు మేనిఫెస్టోలో చెప్పిన రూ.20 వేల పెట్టుబడి సాయం ఇవ్వకుండా ఎగ్గొట్టేశాడని, అలా రైతులను మోసగించాడని విమర్శించారు. అలాగే ప్రతి పిల్లాడిని చూపి నీకు రూ.15 వేలు, నీకు 15 వేలు... ఇస్తామని చెప్పి ప్రతి పిల్లాడిని, ప్రతి అక్కచెల్లెమ్మనూ మోసగించాడని అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి అమ్మాయికి, ప్రతి అక్కచెల్లెమ్మకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి వాళ్లకూ ఎగనామం పెట్టాడన్నారు. ఈరోజు ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకుంటున్న పిల్లలకు జనవరి, ఫిబ్రవరి, మార్చి క్వార్టర్ ఫీజులు రాలేదన్నారు. పిల్లలకు వసతి దీవెన ఎగ్గొట్టేశారని, అక్క చెల్లెమ్మలకు రావాల్సిన సున్నా వడ్డీ, అది కూడా చంద్రబాబు ఎగ్గొట్టేశాడని జగన్ వివరించారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా క్యాలెండర్ ప్రకటించి అమలు చేశామని గుర్తు చేశారు. అమ్మఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా... ఇవన్నీ కూడా మాకెందుకు ఇవ్వలేదని ప్రజలంతా అడుగుతున్నారన్నారు. చివరకు ఏ ఒక్కరూ మిమ్మల్ని ప్రశ్నించకూడదని, రోడ్డెక్కకూడదని గ్రామస్థాయి నుంచి ఈ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కొనసాగితే మీ ప్రభుత్వం చాలా వేగంగా తుడిచి పెట్టుకుపోతుందని, ఆ తర్వాత మా ప్రభుత్వం వస్తుందని, అప్పుడు మా కార్యకర్తలు, మేము వద్దు వద్దు అని చెప్పినా కూడా వినకుండా టీడీపీ వారికి బుద్ధి చెప్పేలా చంద్రబాబు నేడు బీజం వేస్తున్నారన్నారు. ఇటీవల నంద్యాలలో ఏకంగా చంపేసిన ఘటన చూశామని, శుక్రవారం తాను అక్కడికి వెళుతున్నానని, ఆ ఘటనను రాష్ట్రం, దేశం దృష్టికి తీసుకువెళతానని జగన్ తెలిపారు. ఈ దాడులు, హత్యలపై కచ్చితంగా హైకోర్టు తలుపులు తడతామని, అవసరమైతే సుప్రీంకోర్టునూ ఆశ్రయిస్తామని జగన్ వెల్లడించారు. ఈ అన్యాయాలు, అఘాయిత్యాలను చూసి, ఎందుకు రాష్ట్రపతి పాలన విధించకూడదు అని హైకోర్టు, సుప్రీం కోర్టును అడుగుతామన్నారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని జగన్ విన్నవించారు.

నేటినుంచి విశాఖ నేతలతో జగన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు విశాఖ నేతలతో జగన్ భేటీ కానున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీతో జగన్ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశానికి విశాఖ జిల్లాకు చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం చేస్తారు. రాబోయే బుధ, గురు, శుక్రవారాల్లో బిజీ షెడ్యూలు కారణంగా జగన్ క్యాంపు కార్యాలయానికి సందర్శకులు రావొద్దని పార్టీ కార్యాలయం తెలిపింది.

ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి: వెంకట లక్ష్మి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : చిన్నాపెద్దా వయసు తారతమ్యం లేకుండా మహిళలపై, ముక్కుపచ్చలారని పసికందులపై లైంగిక దాడులకు, హత్యాచారాలకు తెగబడుతున్న ఉన్మాదులను కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి అన్నారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి యత్నంపై ఆమె సీరియస్ అయ్యారు. మంగళవారం విజయవాడ పాత జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధిత బాలికను పరామర్శించారు. బాలిక త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని, ఆరోగ్యం కుదుటపడే వరకు అందుబాటులో ఉండి పర్యవేక్షించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు గజ్జల వెంకట లక్ష్మి సూచించారు. అనంతరం మీడియాతో ఘటనపై మాట్లాడుతూ కంటనీరు పెట్టారు. ఇంత పైశాచికత్వానికి పాల్పడిన ఉన్మాదులను ఉరి తీసినా తప్పు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధిత బాలికను పరామర్శించిన మంత్రి పార్థసారథి: పాత జీజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను మంత్రి కొలుసు పార్థసారధి పరామర్శించారు. ఘటన అత్యంత దారుణం, అమానుషమని అన్నారు. ఘటనను హోం మంత్రి, డీజీపీ దృష్టికి తీసుకువెళ్లామని, నేరానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదేశించామని తెలిపారు.

వేతనాల పెంపుకోసం ఉద్యమం

మున్సిపల్ కార్మికులకు ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖపట్నంలో సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమ్మేళనాలను జయప్రదం చేసేందుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కృషి చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. స్థానిక గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం కోట మాల్యాద్రి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ... సెప్టెంబర్ 3న జరిగే ర్యాలీ బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అంకెల గారడి బడ్జెట్ ప్రవేశపెట్టిందే గాని కార్మిక వర్గానికి ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ సమ్మె సందర్భంగా అంగీకరించిన హామీల మేరకు పెరగాల్సిన వేతనాల పెంపు కోసం ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ గత మార్చి 16న ఎన్నికల కోడ్ రావడంతో ఆప్కాస్‌లో నిలిచిపోయిన పేర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏ ప్రభుత్వమైనా పర్మినెంట్ కార్మికుల జీపీఎఫ్ ఖాతాలు తెరవకుండా తాత్సారం చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. ఈసారి ఇది సాధించేంత వరకు పోరాటాలను కొనసాగించాలన్నారు. ఆ మేరకు ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకుంటూ మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్స్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎదుట కమిషనర్లకు వినతి పత్రాల అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బందెల రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే మల్లేశ్వరరావు, కోశాధికారి తాడికొండ వాసు, ఉపాధ్యక్షులు పులగం మద్దిలేటి, హరిబాబు, కార్యదర్శులు రాజేష్ గౌడ్, ఉండవల్లి గోపాల్ రావు, దుర్గారావు వర్కింగ్ కమిటీ సభ్యులు సురేష్ కుమార్, తారక రామారావు చిరంజీవి నిమ్మకాయల శ్రీనివాసరావు, నేలపాటి శ్రీనివాసులు,అంకయ్య పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం: మంత్రి ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మైనార్టీల సంక్షేమానికి తీవ్ర విఘాతం కలిగిందని, మైనార్టీలందరినీ జగన్ ప్రభుత్వం దగా చేసిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఎన్ఎండి ఫరూక్ ఆరోపించారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేసిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ పథకాలన్నీ నిర్వీర్యం చేయడం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో2011 జనాభా లెక్కల ప్రకారం 43.46 లక్షల మంది మైనార్టీలు ఉన్నారని.. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి జన వికాస కార్యక్రమం, సీఎస్ఎస్ కింద 60:40 భాగస్వామ్యంలో భాగంగా రూ. 447.06 కోట్లు మంజూరు కాగా, రూ. 93.67 కోట్లతో 77 ప్రాజెక్టులను చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో 10 జూనియర్ కళాశాలలు, 9 ఐటీఐ కళాశాలలు, 5 పాలిటెక్నిక్ కళాశాలలు, 18 రెసిడెన్షియల్ పాఠశాలలు, 35 హాస్టళ్లను మంజూరు చేశామని... ఇందులో 16 ప్రాజెక్టులు పూర్తయ్యాయని,13 నిర్మాణంలో ఉన్నాయని 43 ప్రారంభం కాలేదని వివరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ పనులన్నింటినీ నిలిపి వేశారని మండిపడ్డారు. విజయవాడలో రూ.80 కోట్లతో టీడీపీ ప్రభుత్వం హజ్ భవనాన్ని మంజూరు చేస్తే దీన్ని అసలు పట్టించుకోలేదని విమర్శించారు. మైనార్టీల సంక్షేమం కోసం అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు అమలు కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

మోదీ రైతులకు ఇచ్చిన హామీ అమలేది?

గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: కార్పొరేట్లను తరిమికొట్టి... బడా కంపెనీల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సంఘం విజయనగరం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం ఉదయం స్థానిక అమర్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ నరేంద్ర మోదీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సూచన ప్రకారం పంటలకు మద్దతు ధరలు కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు పరచకపోగా మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చారని విమర్శించారు. ఆ చట్టాలు అమలయితే రైతులకు ఇప్పటివరకు ఉన్న కనీస మద్దతు ధరల చట్టం పోతుందని, తమ భూముల్లోనే కంపెనీలకు కూలీలుగా మారిపోతామన్న విషయాన్ని గ్రహించిన రైతాంగం 13 మాసాల పాటు శాంతియుత పోరాటాల ద్వారా ఆ చట్టాలను రద్దు చేయించుకున్నారని అన్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీల అధికారులను సలహాదారులుగా నియమించి వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేయాలని చూడటం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. రైతుల ప్రయోజనాలు కాపాడే విత్తన చట్టం లేదని, పంటల బీమాను ప్రైవేట్ కంపెనీలకు ఆదాయ వనరుగా చేశారని, సహకార సంఘాలను కేంద్ర ప్రభుత్వం పెత్తనంలోకి తీసుకున్నదని విమర్శించారు. కార్మిక నాయకులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో స్వయం సమృద్ధిగా ఉన్న పాడి పరిశ్రమను ఆర్ఈసీపీలో చేర్చాలని ప్రయత్నాలు చేసినా రైతుల పోరాటంతో అది ఆగిపోయిందని తెలిపారు. ఇప్పుడు మరల అమూల్ పేరుతో మొత్తం పాడి పరిశ్రమను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలు బ్యాంకులలో దాచుకుంటున్న డబ్బులు సైతం రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు రుణాలుగా ఇవ్వకుండా కార్పొరేట్ సంస్థలకే ఇచ్చేస్తున్నారని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు, విత్తన మార్కెటింగ్ రంగాలలో కార్పొరేట్ కంపెనీల ప్రవేశాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ నినాదంతో అన్ని జిల్లా, మండల కేంద్రాలలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వివిధ రూపాలలో నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి.అప్పలరాజు, సంఘం జిల్లా నాయకులు ఒమ్మి రమణ, బుగత అశోక్, అలమండ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బత్తుల మృతి తీరని లోటు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు, సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు అకాల మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంతాపం తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్. కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బత్తుల మరణం వ్యవసాయ కార్మిక సంఘానికి, అటు సీపీఐకి తీరనిలోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బత్తుల వెంకటేశ్వరరావు.. వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా నాయకుడిగా అగ్ర నాయకులతో కలిసి భూ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారని, నిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేసే వారని గుర్తుచేశారు. బత్తుల మృతికి సీపీఐ కృష్ణాజిల్లా సీనియర్ నాయకులు మోదుమూడి రామారావు, దేవభక్తుని నిర్మల వేర్వేరు ప్రకటనల్లో సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. పేద ప్రజలు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి బత్తుల నిరంతరం కృషి చేశారని శ్లాఘించారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు గ్రేస్ మార్కులు వేయాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 2023 జనవరి 22న జరిగిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థులకు న్యాయపరమైన సమస్యలు తొలగించి ఐదు గ్రేస్ మార్కులు వేయాలని కోరుతూ మంగళగిరిలో ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ తదితరులు హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలకు త్వరలోనే నోటిఫికేషన్లు ఇచ్చి ఏపీపీఎస్సీ, ఏపీ డీఎస్సీ ఉద్యోగ వయో పరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని, త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు అకాడమీ పుస్తకాలను ఉచితంగా అభ్యర్థులకు ఇవ్వాలని హేమంత్ కోరారు. ఈ కార్యక్రమంలో కె.శివ ప్రసాద్, ఎడ్ల లక్ష్మణరావు, షేక్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

15న అన్న క్యాంటీన్ల ప్రారంభం: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, డైరెక్టర్ హరి నారాయణన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటు, డ్రెయిన్లలో పూడిక తొలగింపుపై కమిషనర్లకు మంత్రి సూచనలు చేశారు. నారాయణ మాట్లాడుతూ 33 మునిసిపాలిటీలలో 100 అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆ మేరకు క్యాంటీన్ భవనాల్లో కిచెన్ ఏర్పాటు చేసే బృందాలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రెయిన్లలో పూడిక తీత పనులను వేగవంతం చేయాలన్నారు.

రేషన్ సక్రమంగా అందేలా చూడాలి

రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రేషన్ సరుకులు కార్డుదారులకు సక్రమంగా అందేలా చూడాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, మహిళా, శిశు అభివృద్ధి సంస్థ (అంగన్‌వాడీ), మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థుల వసతులు, ప్రధాన మంత్రి మాతృ వందన పథకాల అమలు తీరు, ఇతర లోటు పాట్ల గురించి ఆయా శాఖ అధికారులతో చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వ నిబంధనల మేరకు భోజనం, గుడ్లు, బాలామృతం, బాల సంజీవని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బక్కముంతల కాంతారావు, లక్ష్మి రెడ్డి, జక్కంపూడి కృష్ణ కిరణ్, జి.దేవి, ఉప సంచాలకులు పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ ప్రజలను ఆదుకుందాం

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: కేరళలో ప్రకృతి విపత్తు కారణంగా తీవ్రంగా నష్టపోయిన వయనాడ్ ప్రాంత ప్రజలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సీపీఐ నగర సమితి అధ్వర్యంలో గుంటూరు కృష్ణానగర్ చంద్ర రాజేశ్వరరావు పార్కు కమిటీ మంగళవారం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. వయనాడ్ ప్రాంత బాధితులకు అవసరమైన నిత్యావసర వస్తువులు, బట్టలు తదితరాలను సేకరించారు. ఈ సందర్భంగా జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ భారీ వరదల కారణంగా కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని... 400 మంది ప్రజలు మరణించడం బాధాకరమన్నారు. ఈ ప్రకృతి విపత్తు దేశ ప్రజలను కలచివేసిందన్నారు. ఆ ప్రాంత ప్రజలకు తమ వంతుగా అనేక విధాలుగా సహాయ సహకారాలు సీపీఐ ఆధ్వర్యంలో అందించడం జరుగుతోందని వెల్లడించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ వరదలతో వయనాడ్ ప్రాంతం శవాలదిబ్బగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలకు సహాయ సహకారాలను అందించేందుకు సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా విరాళాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చంద్ర రాజేశ్వరరావు పార్కు కమిటీ ఆధ్వర్యంలో బియ్యం, దుస్తులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజానీకం ఆపదలో ఉన్నప్పుడు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన చంద్ర రాజేశ్వరరావు పార్క్ కమిటీ సభ్యులకు, నగర ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్, చంద్ర రాజేశ్వరరావు పార్కు కమిటీ కన్వీనర్ రామచంద్రుడు, కమిటీ సభ్యులు కట్టా వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీనివాసరావు, ఎస్‌కే బాబు, కొండలు, రమాదేవి, సత్యనారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో పేదలు ఉండొద్దా?: మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదనే ఆలోచనతో చంద్రబాబు ఉన్నారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆరోపించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నాగార్జున మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన స్థలాలను చంద్రబాబు రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక అందరికీ సమన్యాయం చేయాలన్నారు. కులమతాలకు అతీతంగా వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. చంద్రబాబు రెండు నెలల పాలన లో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో దాడులు పెరిగిపోతున్నప్పటికీ, చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో దాడులు మంచిది కాదని, తమ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు.

వైసీపీ క్యాంపు కార్యాలయంలో మీడియా గది

వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో పార్టీ మీడియా రూమ్‌ను ప్రారంభించారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశాల కోసం ప్రత్యేకంగా రూమ్‌ను సిద్ధం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన మీడియా రూమ్ ను శాసనమండలిలో ప్రతిపక్షనేత లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.11 టు 13/టిఓ/2024-25, తేది : 02-08-2024
కార్యనిర్వాహక ఇంజనీరు, ఆర్.డబ్ల్యు.ఎస్&ఎస్ డివిజన్, భీమవరం పరిధిలోని 3 పనులు చేయుటకుగాను అంచనా విలువ : రూ.67.20 లక్షలకు టెండర్లు కోరడమైనది. టెండరు తీసుకొను ఆఖరి తేది: 21-08-2024, మ॥ 3 గంటల వరకు. వివరాలను www.ap.eprocurement.gov.inలో చూడగలరు. ఫోన్ : 9441148974
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, ఆర్.డబ్ల్యు.ఎస్ & ఎస్ డివిజన్, భీమవరం
DIPR/13841/CL/ADVT-1/1/2021-22 Dt. 06-08-2024

సంపాదకీయం

రెక్కలు విరిగిన పక్షి కశ్మీర్

సరిగ్గా అయిదేళ్ల ఒక్క రోజు కింద మోదీ ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని రద్దు చేసిన తరవాత జమ్మూ-కశ్మీర్ రాష్ట్రమే భారత రాజకీయ చిత్రపటం మీంచి చెరిగి పోయింది. ప్రస్తుతం ఉన్నదల్లా జమ్మూ-కశ్మీర్, లడాఖ్ అనే రెండు నిర్జీవమైన కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే. 370 వ అధికరణం కారణంగానే ఆ రాష్ట్రంలో తీవ్రవాదం ప్రబలిందని, 370 వ అధికరణం రద్దు వల్ల దేశమంతటికీ వర్తించే చట్టాలు జమ్మూ-కశ్మీర్, లడాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా వర్తిస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా 370 వ అధికరణం రద్దు ప్రతిపాదిస్తున్నప్పుడు ఇల్లెక్కి అరిచినట్టు చెప్పారు. 370 వ అధికరణం రద్దుచేసి అర దశాబ్దం గడిచింది. మునుపటి జమ్మూ-కశ్మీర్ ప్రజల పరిస్థితిలో ఏమైనా మార్పు వచ్చిందా అంటే ఇసుమంత మార్పు కూడా కనిపించడం లేదు. పైగా మునుపటికన్నా జనాభిప్రాయాన్ని నొక్కేయడం మాత్రం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 370 వ అధికరణాన్ని రద్దు చేయడానికి ముందు అరెస్టు చేసిన ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మహబూబా ముఫ్తీ నాయకులను కొన్నాళ్ల తరవాత విడుదలచేసి ఉండొచ్చు. అసలు వీరిని అరెస్టే చేయలేదని మోదీ ప్రభుత్వం బుకాయించింది. కానీ వారు తమ ఇళ్ల ప్రహరీ గోడ దాటి బయటకు తొంగిచూసే అవకాశం కూడా లేకుండా చేశారు. 370 వ అధికరణం రద్దు చేసినందువల్ల జరిగిందల్లా అంతవరకు సాపేక్షికంగా ప్రశాంతంగా ఉన్న జమ్మూ, లడాఖ్ ప్రాంతంలోనూ ఇప్పుడు తీవ్రవాదులు వీర విహారం చేస్తున్నారు. దీన్ని ఆపడం కేంద్ర ప్రభుత్వం తరం కావడంలేదు. 370 వ అధికరణాన్ని రద్దు చేస్తే జమ్మూ-కశ్మీర్ పరిస్థితి గణనీయంగా మారిపోతుందని, దేశమంతటి లాగే ఆ ప్రాంతం కూడా భారత్‌లో సమ్మిళితం అవుతుందని మోదీ ప్రభుత్వం ప్రచారం చేసింది. అక్కడ వ్యాపార, వాణిజ్య, పారిశ్రామికీకరణ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఈ ఛాయలేవీ అయిదేళ్ల తరవాత కూడా కనిపించడం లేదు. చివరకు స్థానిక బీజేపీ నాయకులు కూడా 370 వ అధికరణం రద్దును బాహాటంగా కీర్తించలేక పోతున్నారు. అంతకు ముందు లడాఖ్ ప్రజలు తాము విడిగా ఉండాలని కోరుకున్నారు. ఇప్పుడు కేంద్ర పాలిత ప్రాంతమైన తరవాత అంతకు ముందున్న పరిస్థితే మెరుగ్గా ఉందంటున్నారు. 370 వ అధికరణం రద్దు కాకముందు కేవలం కశ్మీర్ లోయ ప్రాంతంలోని ప్రజల్లోనే అసంతోషం, ఆగ్రహం కనిపించేది. ఇప్పుడు లడాఖ్, జమ్మూ ప్రాంత ప్రజల్లోను అసంతృప్తి పెల్లుబుకుతోంది. అయితే సర్వమూ కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్నందువల్ల, జనం నోరు విప్పే అవకాశం లేనందువల్ల, పత్రికలు నామమాత్రంగా మిగిలిపోయినందువల్ల అసలు పరిస్థితి ఏమిటో అంతుపట్టడం లేదు. దిల్లీలో కొలువుదీరిన ప్రభుత్వంపై 370 వ అధికరణం రద్దుకు ముందు ఉన్న వ్యతిరేకత భిన్నమైంది కావచ్చు. ఇప్పుడు అసంతృప్తి మూడు ప్రాంతాలలోనూ భయానకంగా తయారైంది. వ్యక్తీకరణకు అవకాశం లేనందువల్ల అసలు విషయం బయటకు పొక్కడం లేదు. తమను నిరాశ పరిచారన్న అభిప్రాయం సర్వత్రా కనిపిస్తూనే ఉంది. ఈ అభిప్రాయం బాహాటంగా వ్యక్తం కాకపోవడానికి కారణం మోదీ ప్రభుత్వం ఆ రెండు కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజలను చెప్పుకింద తేలులా అణచిపెట్టడమే.

స్పష్టంగా కనిపిస్తున్న తేడా ఏమైనా ఉంటే అది కశ్మీర్ స్వతంత్రం కావాలన్న ఆకాంక్ష బహిరంగంగా వ్యక్తం కావడానికి అవకాశం లేకపోవడమే. భారత ప్రభుత్వ వ్యతిరేక రాతలు గోడల మీద కనిపించకపోవడమే. అంతకు ముందు కశ్మీర్‌కు ఉన్న పతాకం మాయమై పోయింది. ఇప్పుడు అన్నిచోట్ల త్రివర్ణ పతాకం రెప రెపలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ భవనాల మీద, గంట స్తంభాల మీద, వాట్సాప్‌లలో ప్రభుత్వ ఉద్యోగులు పంపే సందేశాల మీద జాతీయ పతాకం దర్శనం ఇస్తోంది. చివరకు చినార్ చెట్ల బోదెల మీదా జాతీయ పతాకం రంగులద్దడం గోచరిస్తోంది. వాజ్‌పేయి నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు కశ్మీర్ సమస్యకు పరిష్కారం కుదర్చడానికి సంప్రదింపులజాడ కనిపించేది. 370 వ అధికరణం రద్దు తరవాత స్థానిక ప్రజలతో, రాజకీయ నాయకులతో మోదీ ప్రభుత్వం చర్చలు జరిపిన ఉదంతమే లేదు. అనేక ఏళ్ల నుంచి "కశ్మీర్ భారత్ లో అంతర్భాగం" అని నినదించని ప్రభుత్వమే లేదు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అన్న భావన ముందు నుంచే ఉన్నప్పటికి మోదీ ప్రభుత్వం ఈ లక్ష్య సాధన కోసమే 370 వ అధికరణాన్ని రద్దు చేశామని బాకా ఊదుకుంటోంది. 2019 తరవాతే కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమైనట్టు బుకాయిస్తోంది. దేశమంతటికీ వర్తించే చట్టాలు కశ్మీర్‌కు కూడా వర్తిస్తాయని మోదీ సర్కారు ఎంత గట్టిగా ప్రచారం చేసిన అక్కడి ప్రజల భద్రతా చట్టాన్ని తొలగించనే లేదు. పైగా దీన్ని ఒక ఆయుధంగా వినియోగిస్తోంది. కాలం చెల్లిన అనేక చట్టాలను తవ్వి తీసి అమలు చేస్తున్నారు. జమ్మూ-కశ్మీర్‌కు ఉన్న రాష్ట్ర ప్రతిపత్తిని త్వరలోనే పునరుద్ధరిస్తామన్న మోదీ, అమిత్ షా వాగ్దానం హిమాలయ పర్వత సానువుల్లో గడ్డ కట్టుకుపోయింది. అక్కడ శాసనసభను పునరుద్ధరిస్తామని చెప్పిన మాటను మోదీ సర్కారు వాటంగా మరిచిపోయినట్టుంది. రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరించకుండా ఎన్నికలు నిర్వహించినా సకల విషయాలు దిల్లీ పీఠాధిపతుల గుప్పెట్లోనే ఉంటాయి. స్థానిక ప్రజలకు గోరంత అధికారం ఉదాహరణ ప్రాయంగా అయినా స్థానికులకు ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ ఏడాది సెప్టెంబర్ 30 లోగా అక్కడ ఎన్నికలు నిర్వహించాలన్న సుప్రీంకోర్టు ఆదేశం కూడా మోదీ అమలు చేసే ఆనవాళ్లే కనిపించడం లేదు. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ లో వచ్చే నవంబర్ లో శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. కానీ కశ్మీర్ ఊసే లేదు. జమ్మూ-కశ్మీర్ లో ఆఖరుసారి 2014 లో ఎన్నికలు జరిగాయి. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి ఆరేళ్లయింది. రాష్ట్ర ప్రతిపత్తి లేకుండా జమ్మూ-కశ్మీర్‌లో అసెంబ్లీని పునరుద్ధరించి ఎన్నికలు నిర్వహించినా ప్రయోజనం పూజ్యం. సర్వాధికారాలు లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలో అంటే మోదీ ప్రభుత్వం గుప్పెట్లోనే ఉంటాయి. 370 వ అధికరణం రద్దు తరవాత కశ్మీర్ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. మొన్నటి సార్వత్రిక ఎన్నికలతో పాటు జమ్మూ-కశ్మీర్ లోని లోకసభ స్థానాలకు ఎన్నికలు జరిగిన మాట నిజమే. జమ్మూలో బీజేపీ అభ్యర్థి చావుతప్పి కన్ను లొట్ట పోయిన రీతిలో గెలిచారు. లడాఖ్‌లో ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించారు. బీజేపీ మూడో స్థానంలో చతికిలపడింది. కశ్మీర్ లోయలో ఉన్న స్థానాల్లో బీజేపీ పోటీచేసే సాహసమే చేయలేకపోయింది. అంటే అక్కడ పరిస్థితి ఏ మాత్రం మెరుగు పడలేదని బీజేపీకి తెలిసినా బీరాలు పలుకుతోంది. బీజేపీ మద్దతిచ్చిన అభ్యర్థులందరూ ఘోరంగా ఓడిపోయారు. వ్యక్తిగతంగా కూడా ప్రజలు మనసువిప్పి మాట్లాడే పరిస్థితి లేదు. కేంద్రం నిఘా నేత్రాలు సర్వవ్యాప్తమైనాయి. వ్యాపారాలు, కాంట్రాక్టులు ఇతర ప్రాంతాల వారికే కట్టబెడ్తున్నారు. వారికి విస్తారంగా భూములు కేటాయిస్తున్నారు. స్థానికులలో నిరుద్యోగం తాండవిస్తోంది. ఉన్న జీవనోపాధీ పోతోంది.

వర్గీకరణ తీర్పుపై ఇరకాటంలో మోదీ

ఎం కోటేశ్వరరావు

దళితులు, గిరిజనుల్లో సామాజిక న్యాయం జరిగేందుకు రాష్ట్రాలలో అమలుచేస్తున్న రిజర్వేషన్లలో ఆయా తరగతుల వర్గీకరణ జరిపి వాటాలను నిర్ణయించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు దశాబ్దాలుగా నడుస్తున్న ఒక అంకానికి తెరదించింది. మరో దానికి నాంది పలికింది. దీనికోసం ఎదురు చూసినవారు ఆనందంతో ఉండగా వ్యతిరేకించిన వారు విచారంలో మునిగిపోయారు. ఈ రెండు భావనలూ వాస్తవమే అయినా తాత్కాలికమే. అంటరానితనంతో సహా మొత్తంగా జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం జరపాలని కోరుకుంటున్నవారి ప్రయత్నాలకు కాస్త ఇబ్బందే. ప్రతి అస్తిత్వ భావన ఎంతో కొంత చెరుపు చేస్తుంది. రాష్ట్రాలలో వర్గీకరణ గురించి ఒక స్పష్టత వచ్చింది. మరి కేంద్ర సర్వీసులు, ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ఎల్ఐసి వంటి ఆర్థిక, విత్త సంస్థలలో దళితులు, గిరిజనులతో పాటు ఓబీసీ వర్గీకరణ మాటేమిటి అన్న ప్రశ్న ముందుకు వస్తున్నది. అభివృద్ధి జరగాలంటే రెండు ఇంజన్ల పాలన ఉండాలన్న నినాదాన్ని ముందుకు తెచ్చిన పెద్దలు కేంద్రం గురించి కొన్ని రాష్ట్రాలలో వర్గీకరణ ఘనత మాదే అంటున్నారు, కొన్ని చోట్ల మౌనంగా ఉంటున్నారు. తమ ముందున్న అంశాల గురించి మాట్లాడటంలేదు. వర్గీకరణ సమస్యను ముందుకు తెచ్చిన వారు కూడా రాష్ట్రాల గురించి తప్ప కేంద్రం అంశాన్ని ప్రస్తావించకపోవటం వెనుక ఉన్న కారణం ఏమిటి ?

అసమానతలు, దారిద్ర్యం, ఉపాధి రంగాలలో నెలకొన్న దుస్థితికి ఎక్కడాలేని అంటరానితనం అనే సామాజిక వివక్ష కారణంగా ఏర్పాటు చేసిన రిజర్వేషన్లు ఉపశమనం తప్ప శాశ్వత నివారణ కాదు. వాటిని కూడా కొంత మందే పొందుతున్నారు. దానిపై అసంతృప్తి నుంచి ముందుకు వచ్చిందే వర్గీకరణ. అది న్యాయసమ్మతమే కనుక ఎక్కువమంది ఆమోదం పొందింది. గతంలో సంస్థానాధీశులు, జమిందార్లు, భూస్వాములు భూమి వదులు కొనేందుకు సిద్ధం కాలేదు. రిజర్వేషన్ల వలన లబ్ధిపొందిన కొన్ని తరాలు కూడా అదే కోవకుచేరి వర్గీకరణను వ్యతిరేకించిన ఫలితమే కోర్టుల జోక్యం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వివాదంలో వర్గీకరణ చెల్లదని 2004లో సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన తీర్పు చెల్లదని పంజాబ్, హర్యానా హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సమీక్షించి వర్గీకరణ సబబే అని తాజాగా ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 6-1 మెజారిటీచటీశీఅఁతో తీర్పు ఇచ్చింది. ఆ సందర్భంగా సదరు వర్గీకరణ ఎలా ఉండాలో కూడా న్యాయమూర్తులు చెప్పారు. రాష్ట్రాలు వాటిని ఎలా తమ చట్టాలలో పొందుపరుస్తాయో చూడాల్సి ఉంది. అవి కోర్టుల సమీక్షకు లోబడి ఉండాలని, రాజకీయ దుర్వినియోగం చేయకూడదని కూడా కోర్టు స్పష్టం చేసింది. గతంలో క్రీమీ లేయర్ (మెరుగైన ఆర్థిక స్థితి) ఓబీసీలకు మాత్రమే వర్తింప చేశారని ఇప్పుడు ఎస్సీ, ఎస్టీలకూ అమలు చేయవచ్చని కూడా పేర్కొన్నది. దళితుల ఉపకులాలైన వాల్మీకులు, మజాబీ సిక్కులకు 50 శాతం రిజర్వేషన్లు అమలు జరపాలన్న ఆ రాష్ట్ర చట్టాన్ని 2004 సుప్రీంకోర్టు తీర్పు ప్రాతిపదికన 2010లో పంజాబ్-హర్యానా హైకోర్టు కొట్టివేసింది. దళితులంటే అందరూ ఒకటే అని వారిని విడదీయ కూడదని చెప్పింది. తాజా తీర్పు ఆ వైఖరి తప్పు అని పంజాబ్‌లో చేసిన చట్టం సరైనదే అని చెప్పింది. ఇప్పటి వరకు ఈ అంశాన్ని ఉపయోగించుకొని రాజకీయ పక్షాలు లబ్ధి పొందేందుకు చూసినందున పార్టీలపై కచ్చితంగా ఈ తీర్పు ప్రభావం పడనుంది, అదెలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. ప్రతిదాన్నీ రాజకీయం చేసేందుకు చూస్తున్న తరుణమిది.

దళితుల వర్గీకరణ డిమాండ్ అన్ని రాష్ట్రాలలో ఒకే విధంగా లేదు. కులాల పేర్లు ప్రస్తావించకూడదని అనుకున్నప్పటికీ సందర్భవశాత్తూ తప్పటం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలలో మాదిగ సామాజిక తరగతి వర్గీకరణను కోరుతుండగా, పంజాబ్‌లో అదే తరగతి వ్యతిరేకిస్తున్నది. రిజర్వేషన్ల వలన లబ్ధిపొందిన కొన్ని కులాలు తమకు అవకాశాలు తగ్గిపోయాయనే భావనతో వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు. ఇది మిత్ర వైరుధ్యమే తప్ప శత్రుకాదు. వర్గీకరణ అనుకూల, వ్యతిరేక భావనలకు పంజాబులో నాంది పలికారు. అకాలీదళ్ తన పలుకుబడిని పెంచుకొనేందుకు దళితుల్లో వెనుకబడిన వాల్మీకులు, మజాబీ సిక్కులకు అన్యాయం జరిగిందంటూ వారిని సమీకరించేందుకు పూనుకుంది. దాన్ని ఎదుర్కొనేందుకు 1975 మే 5న కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రిగా ఉన్న జ్ఞానీ జైల్‌సింగ్ రిజర్వేషన్ల తురుపుముక్కను ప్రయోగించారు. ప్రభుత్వశాఖలలో వీలైన మేరకు ఈ రెండు సామాజిక తరగతుల వారికి 50శాతం రిజర్వేషన్లు అమలు జరపాలని ఆదేశించారు. దీంతో అప్పటికే గణనీయంగా లబ్ధిపొందిన మాదిగ సామాజిక తరగతి అవకాశాలు తగ్గిపోయాయి. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పంజాబ్ జనాభాలో 32శాతం మంది దళితులు ఉన్నారు. రాష్ట్రం వర్గీకరణ అమలు చేస్తున్నప్పటికీ వాల్మీకులు, మజబీల పరిస్థితి పెద్దగా మెరుగుపడిందేమీ లేదు. వర్గీకరణ లేని కారణంగా కేంద్ర సర్వీసులలో వారు తగిన ప్రాతినిధ్యం పొందలేకపోయారు. 2004 ఆంధ్రప్రదేశ్ వర్గీకరణ చెల్లదంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత సదరు అంశాన్ని సవాలు చేశారు. హైకోర్టు వర్గీకరణను రద్దు చేసింది. అక్కడి పరిస్థితి గురించి 2007లో వర్గీకరణ సమస్యమీద ప్రచురితమైన ఒక విశ్లేషణ ప్రకారం 105 మంది ఐఎఎస్‌లలో పంజాబ్ దళితుల్లో 42శాతం మంది ఉన్న వాల్మీకులు, మజాబీలు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఆది ధర్మీస్‌గా పిలిచే సామాజిక తరగతి తోలువృత్తిలో ఉన్న దళితులు ఆర్థికంగా, సామాజికంగా మెరుగైన స్థితిలో ఉన్నారు. కారణం బ్రిటీష్ భారత సైన్యంలో ఉన్న వారికి అవసరమైన బూట్ల తయారీలో వారు నిమగ్నంకావటంతో దానికి పరిమితంగానైనా చదువు సంధ్యలు అవసరం కావటం, ఆర్థికస్థితిమెరుగై రిజర్వేషన్ అవకాశాలను కూడా ఎక్కువగా అందిపుచ్చుకున్నారు. వ్యవసాయ కార్మికులుగా, పట్టణాలలో పారిశుద్ధ్య కార్మికులుగా ఉన్న దళితులకు చదువుతో అవసరం లేకపోయింది. హర్యానాలో 1994లో దళితులను ఏ-బి తరగతులుగా విభజించి తోలు వృత్తి చేసేవారికి 50శాతం ఇతరులకు మిగతా సగం రిజర్వేషన్లు కల్పించారు.తోలు వృత్తి చేసేవారు ఎక్కువగా లబ్ధి పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ గురించి అధ్యయనం చేసిన ఉషా మెహ్రా కమిషన్ 2008 నివేదిక నాలుగు ఉపతరగతులుగా రిజర్వేషన్లు అమలు జరపాలని సిఫార్సు చేసింది. దళితుల్లో ముందున్న మాలలు ఐఎఎస్, ఐపిఎస్ ఎంపికల్లో 76, 86శాతం మంది ఉండగా మాదిగలు 23, 13శాతాల చొప్పున ఉన్నట్లు పేర్కొన్నది.దళిత జనాభాలో మాలలు 41శాతం కాగా మాదిగలు 49శాతం ఉన్నారు. ప్రతి రాష్ట్రంలో దాదాపు ఇలాంటి పరిస్థితి ఉన్నది.

దళితులు, వెనుకబడిన తరగతులలో కొందరు అన్యాయానికి, విస్మరణకు గురౌతున్నారంటూ బీజేపీ వారిని తన ఓటు బ్యాంకుగా మార్చుకొనేందుకు పావులు కదిపింది. దానిలో భాగంగానే ఓబీసీల వర్గీకరణ పరిశీలనకు 2017లో కేంద్ర ప్రభుత్వం జస్టిస్ రోహిణీ కమిషన్ ఏర్పాటు చేసింది. తన నివేదికను 2023జులై 31న రాష్ట్రపతికి అందచేసింది. నరేంద్రమోదీ ప్రభుత్వం ఇంతవరకు దాని గురించి పట్టించుకోలేదు. దానిలో ఉన్న అంశాలు వెల్లడైనా, కేంద్ర ప్రభుత్వం వాటి గురించి అభిప్రాయం వెల్లడించినా లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డిఏ విజయావకాశాలపై ప్రభావం చూపుతుందనే రాజకీయ కారణంతో ఆ నివేదికను అటకెక్కించింది. రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఎందుకు తెప్పించుకోలేదన్నది ప్రశ్న. రాజకీయ కారణాలతోనే కమిషన్ గడువును పదమూడుసార్లు పొడిగించారు. ఏడాది గడుస్తున్నా దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము ఎందుకు కేంద్రానికి పంపలేదు, ఎంతకాలం తన దగ్గర ఉంచుకుంటారన్నది ఆసక్తి కలిగించే అంశం. ఆ నివేదికను కేంద్రం తిరస్కరిస్తే వేరు, ఆమోదిస్తే పార్లమెంటుకు సమర్పించాలి, ఒక నిర్ణయం తీసుకోవాలి.

వేగంగా పనిచేస్తామని చెప్పుకుంటున్న మోదీకి ఇది ఒక సవాలే. నివేదికలోని అంశాలపై మీడియాలో తిరుగుతున్న లీకు సమాచారం ప్రకారం ఓబీసీలలో ఐదు నుంచి ఆరువేల ఉపతరగతులు ఉన్నారని, వారి జనాభాలో కేవలం ఒక శాతంగా ఉన్న 40 కులాలవారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో 50శాతం మేరకు రిజర్వేషన్ లబ్ధిపొందుతున్నట్లు తేలిందట. ఈ నివేదికను తెరవటం అంటే వెంటనే వచ్చే అంశం వెనుకబడిన తరగుతుల జన గణన. దాన్ని రాష్ట్రాలు చేపట్టవచ్చునని బీజేపీ తప్పించుకుంటున్నది. ఇంతవరకు ఆ పార్టీ పాలిత రాష్ట్రాలు బుల్డోజర్లు, మత విభజన మీద చూపుతున్న శ్రద్ధలో నూరోవంతు కూడా అందుకు చొరవచూపలేదు. ఒక రాష్ట్రంలో బీసీగా ఉన్న వారు మరొక రాష్ట్రంలో ఓసిగానో, కొన్ని చోట్ల దళితులు, గిరిజనులుగానో ఉన్న ఉదంతాలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. అందువలన రాష్ట్రాలు తీసిన జనాభా లెక్కలను కేంద్రం ఆమోదిస్తుందా అన్నది ప్రశ్న. కేంద్రమే నిర్వహించినా అదే సమస్య ఎదురు కావచ్చు. రెండవది జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతం నిర్ణయించాలనే డిమాండ్‌కు దారితీసే అవకాశం కూడా ఉంది.1953లో ఏర్పాటుచేసిన కాకా కలేల్కర్ తొలి కమిషన్ బిసిలను వెనుకబడిన, అత్యంత వెనుకబడిన తరుగతులు అనే రెండుగా వర్గీకరించాలని సిఫార్సు చేసింది. మండల్ కమిషన్‌లోని సభ్యుడైన ఎల్ఆర్ నాయక్ అణచివేతకు గురైన బిసిలు, మధ్యస్థంగా ఉన్నవారు అనే రెండు ఉపతరగతులుగా విభజించాలని ప్రతిపాదించారు. రోహిణీ కమిషన్ నిర్దిష్టంగా ఏమి చెప్పిందో తెలియదు.

ప్రపంచ శాంతి అవశ్యం

లిజ్ పైన్

రెండో ప్రపంచ యుద్ధం ముగిసే దశలో 1945 ఆగస్టు 6న హిరోషిమా, 9వ తేదీన నాగసాకి పట్టణాలపై అమెరికా చేసిన బాంబు దాడుల్లో లక్షలాదిమంది మరణించారు. ఇదేదో యాదృచ్ఛికంగా జరిగిందేమీ కాదు, కావాలని బాంబులను అమెరికా వేసిందనేది స్పష్టం. ప్రపంచ ఆధిపత్యాన్ని చాటుకునే క్రమంలో అమెరికా ఈ బాంబుదాడులకు తెగబడింది. ప్రపంచ యుద్ధం తరువాత పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో తమ సామ్రాజ్యవాద విధానాన్ని, పెత్తనాన్ని కొనసాగించేందుకే ఈ ఘాతుకానికి పాల్పడింది. ఈ ఘటనలో హిరోషిమాలో దాదాపు 1,40,000 మంది ఒకే రోజున చనిపోయారు. వేలమంది గాయపడ్డారు. ఈ అణుబాంబు ప్రభావం ఇప్పటి తరాలను కూడా ఇంకా వేధిస్తూనే ఉంది.

అమెరికా ప్రభుత్వానికి, సైన్యానికి తాము చేసిందేమిటో స్పష్టంగా తెలుసు. హిరోషిమా దాడి అనంతరర మూడురోజులకు నాగసాకిమీద బాంబు దాడులు జరిగాయి. ఈ విధ్వంసకాండ వల్ల జరిగిన ఘోరం, నష్టం ప్రపంచానికి అమెరికా వైఖరిని స్పష్టం చేసింది. జపాన్‌లోనూ, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలోనూ సోవియట్ యూనియన్‌కి ఎలాంటి పట్టులేకుండా చేసేందుకే అమెరికా ఈ ఘాతుకానికి పాల్పడింది. ఈ అణుబాంబు దాడులు తర్వాత సరిగ్గా 79 సంవత్సరాలకు, నాటో కూటమి ఏర్పడిన 75 ఏళ్లకు సామ్రాజ్యవాద దేశాల సైనిక, ఆయుధాల శక్తులు అపారంగా పెరిగాయి. ప్రస్తుతం అమెరికా దగ్గర ఉన్న ఆయుధాలు వినియోగించినట్లయితే ఈ ప్రపంచలో ఉన్న అత్యధిక మంది ప్రజలు మరణిస్తారు. బహుశా భవిష్యత్తులో విశ్వమంతా ఆయుధాలతోనే నిండిపోతుందేమో... తాజాగా వాషింగ్టన్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశం(జులై 10,2024) విడుదల చేసిన ప్రకటన చదివితే ప్రజలను భయకంపితులను చేస్తోంది. ఈ ప్రకటన ప్రపంచాన్ని రెండుగా చీలుస్తుందని రష్యా పేర్కొంది. ప్రపంచ టెర్రరిజంగా రష్యా అభివర్ణించింది. ఈ సమావేశంలో చైనా, ఇరాన్, కొరియా,ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, భారత్ దేశాలు పాల్గొన్నాయి.ఈ ప్రకటన చేసిన హెచ్చరికలు ప్రపంచ ప్రయోజనాలకు తీవ్ర ముప్పుకలిగించేలా ఉన్నాయని ఆ ప్రకటన తెలియజేసింది.

స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ ప్రకారం(జూన్,2024) ప్రపంచంలో అణ్వాయుధాలు కలిగిన తొమ్మిది దేశాలు తమ అణ్వాయుధ శక్తిని మరింత పెంచు కుంటున్నాయి. ఈ ఆయుధాలను ప్రయోగించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే ఈ దేశాలు ఆయుధ స్థావరాలను, జలాంతర్గాములను ప్రపంచమంతటా ఏర్పాటుచేశాయి. అత్యధికంగా ఆయుధస్థావరాలు అమెరికా, రష్యాలకు ఉన్నాయి. అత్యంత ఆధునిక అణ్వాయుధాలు ఇజ్రాయిల్‌లో ఉన్నాయి. డిమోనియా వద్ద ఫ్లుటోనియం ఉత్పత్తి రియాక్టర్‌ను ఆధునికంగా తయారు చేస్తున్నారు. బ్రిటన్ వద్ద న్యూక్లియర్ వార్ హెడ్ నిల్వలు పరిమితంగానే ఉన్నాయి. అమెరికా అణ్వాయుధాలను నిల్వ చేసేందుకు సఫోల్క్‌లో ఉన్న సైనిక స్థావరం కేంద్రంగా ఉంది.

స్టాక్ హోమ్ శాంతి పరిశోధనా సంస్థప్రకారం, మానవాళి చరిత్రలో ప్రస్తుతం మనం అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో నివసిస్తున్నాం. 2022 నుంచి యుద్ధాలు, అంతర్యుద్ధాలు పెరిగిపోయాయి. ఇప్పటికే రష్యా-ఉక్రెయిన్ మధ్య జరిగిన యుద్ధంలో వేలాదిమంది మరణించారు. మరికొంతమంది దిక్కుతోచని స్థితిలో శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటుండగా మరికొంతమంది వలసలుగా వెళ్లారు. పలస్తీనాపై దాదాపు రెండు సంవత్సరాలుగా ఇజ్రాయిల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. గాజా ప్రాంతం నుంచి 20లక్షలమందికిపైగా పలస్తీనియన్లను ఇజ్రాయిల్ ఇతర ప్రాంతాలకు తరిమివేసింది. దాదాపు 40వేల మందికిపైగా పలస్తీనీయులు హతులయ్యారు. వీరిలో 15వేల మందికిపైగా చిన్నారులున్నారు. పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిలో అమెరికా కీలకపాత్ర పోషిస్తూ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోంది. ఒకవైపు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, నిధులను అందిస్తూ అమెరికా మరోవైపు శాంతివచనాలు వల్లిస్తోంది. గతంలో ఇజ్రాయిల్ సిరియాలోని ఇరాన్ ఎంబసీ పైన బాంబులు ప్రయోగించడంతో రెండు దేశాల మధ్య వైరం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఇరాన్ ఇజ్రాయిల్‌పైన దాడులు చేసేందుకు సిద్ధమవుతోంది. అమెరికా గతంలో ఇరాక్‌పైన, అనంతరం అఫ్గానిస్తాన్‌పైన దాడులుచేసి లక్షలాదిమందిని హతమార్చిన చరిత్ర ఉంది. ఇప్పటికైనా ప్రపంచదేశాలన్నీ ఒక్కటై శాంతిని నెలకొల్పవలసిన తరుణం ఆసన్నమైంది. అయితే ఇలాంటి అవకాశం లేకుండా నియంతృత్వ, నిరంకుశ ధోరణులతో అమెరికా, నాటో దేశాలు అడ్డుకుంటున్నాయి. వీరిని ఎదుర్కొనేందుకు అనివార్యంగా చైనా, రష్యా, తదితర దేశాలు సిద్ధపడాల్సి వస్తోంది.

మోదీ పాలన ప్రజాస్వామ్య రహితం

సీ.ఎన్ క్షేత్రపాల్ రెడ్డి

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైన పాలననే ఇప్పటికీ కొనసాగిస్తున్నది. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తూ వచ్చింది. 2019 నాటి ఎన్నికల అనంతరం ఇతరులపై ఆధారపడకుండా బీజేపీకే 303 సీట్లు రావడంతో అడ్డు అదుపులు లేవని భావించిన మోదీ సర్కారు ఏకంగా రాజ్యాంగంలోని మౌలికమైన సూత్రాలన్నిటినీ నిర్వీర్యం చేయడం మొదలుపెట్టింది. చక్రవర్తి తరహా పాలన తీసుకురావాలని ఉబలాటపడింది. ఎన్నికల తరుణంలో తాను దైవాంశ సంభూతుడనని ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీనే చెప్పుకున్నారు. పూర్వం చాలా మంది రాజులు, చక్రవర్తులు తాము దైవాంశ కారణంగానే పాలకులుగా ఉన్నామని తమ ప్రజల్ని నమ్మించి, భయపెట్టి పాలన సాగించేవారు. ఇదే ట్రిక్కు ఎన్నికల తరుణంలో మోదీ ప్రదర్శించజూపారని సులభంగానే అర్థం చేసుకోవచ్చు.

భారత దేశంలో ఎన్నికలు, ప్రజాస్వామ్యం అనే భావనలే లేని రాజ్యాన్ని స్థాపించేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ఇందులో భాగమే. రాజ్యాంగ బద్ధమైన ఆర్బీఐ, సీబీఐ, న్యాయవ్యవస్థ వంటి అనేక సంస్థలు నిర్వీర్యం అయ్యాయి. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఆర్టికల్ 370 రద్దు చేశారు. ప్రజాస్వామ్యం భారతీయ విద్యార్థులకు భారమనే భావనను ముందుకు తెచ్చింది. దేశ ప్రజలందరికీ ఆర్థిక సమానత్వం ఉండాలని చెప్తుండగా ఒకరిద్దరు బడా కార్పొరేట్‌లకు దేశ సంపదలన్ని దారాదత్తం చేస్తూ రాజ్యాంగ వ్యతిరేకతను చాటుకుంది. ప్రభుత్వ ఆస్తులను తెగనమ్మేయాలని ప్రయత్నిస్తూనే ఉంది. రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చి వ్యవసాయ నల్లచట్టాలను రూపొందించారు. అయోధ్య రామాలయ ప్రారంభంలోనూ రాజ్యాంగ వ్యతిరేకత వ్యక్తమైంది. రాజ్యాంగాన్ని మార్చడం మా తదుపరి కర్తవ్యమని అనేక మంది బీజేపీకి చెందిన పార్లమెంటు సభ్యులు 2024 సార్వత్రిక ఎన్నికల కన్నా ముందు నుంచీ బాహాటంగానే ప్రకటించిన సందర్భాలు అనేకం. వారు అనుకున్నట్టు బీజేపీకే సొంతంగా 370 సీట్లు, ఎన్‌డీఏ కూటమికి 400 సీట్లు వచ్చి ఉంటే ఈ పాటికే భారత రాజ్యాంగానికి మంగళం పాడేందుకు అవసరమైన చర్యల్ని ప్రారంభించి ఉండేవారే. తాజాగా జరిగిన ఎన్నికల్లో సీట్లు తగ్గి ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడినా పాలకుల ఆలోచనా తీరులో ఏ మార్పు కనిపించడం లేదు. రాజ్యాంగం విషయంలో బీజేపీ నుంచి ఎదురయ్యే ప్రమాద తీవ్రత తగ్గుతుందని చాలామంది భావించారు. కానీ ప్రభుత్వం మాత్రం తమ రాజ్యాంగ వ్యతిరేకతను కొనసాగిస్తూనే ఉన్నది. రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా బడ్జెట్ ప్రవేశపెట్టి తమ భావజాలం పాటించని రాష్ట్రాలకు మొండి చేయి చూపింది. తమ ప్రభుత్వ మనుగడకు అవసరమైన సీఎం చంద్రబాబు, నితీష్ కుమార్‌లను సంతృప్తి పరిచేలా బడ్జెట్‌ను రూపొందించింది. బీహార్‌లో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయం, వరదల నియంత్రణ కోసం అంటూ రూ.11 వేల కోట్లకు పైగా కేటాయింపులు చేసిన కేంద్రం, కేరళలో సంభవించిన వరదల నేపథ్యంలో కనీసం తక్షణ సాయం కూడా ప్రకటించలేదు. 300 వందల మందికి పైగా ప్రాణాలు కోల్పోయినా, వందల మంది ఆచూకీ దొరకకపోయినా కేంద్రం నుంచి సరైన స్పందన లేకపోవడం గర్హనీయం. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర మంత్రి కురియన్ సహాయక శిబిరాలను సందర్శించి వాయనాడ్ వరద పరిస్థితులను పీఎంవో నిశితంగా పరిశీలిస్తున్నదని తప్పించుకున్నాడు. రక్షణ బలగాలు అందిస్తున్న సాయం మరువలేనిదే. అయితే కేవలం ఇది మాత్రమే కేరళలో సంభవించిన విపత్కర పరిస్థితులకు పరిష్కారం కాదు. 2018లో కేరళలో సంభవించిన వరదల్లోనూ 37 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 9 వేల కోట్ల ఆస్తినష్టం జరిగిందని సాయం చేయాలని సీఎం విజయన్ ప్రధానిని కోరితే చాలా కాలం తరువాత కేవలం వంద కోట్లు విదిల్చారు. ఇతర దేశాల నుంచి వచ్చే సాయానికి కూడా అడ్డుపడ్డారు. మూడోసారి అధికారంలోకి వచ్చి నెలలు గడువక ముందే రాజ్యాంగ విరుద్ధమైన అంశాలతో కూడిన నూతన నేర చట్టాలను రూపొందించిన మోదీ ప్రభుత్వం వాటిని దేశ ప్రజలపై రుద్దింది. ఒకే దేశం ఒకే ఎన్నిక విషయంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ గత నవంబరులో ఇచ్చిన నివేదిక అధారంగా సమాఖ్య సూత్రాలకు భిన్నంగా రాచరికందిశగా పావులు కదిపేలా కనిపిస్తున్నది. బీజేపీ కోరుకునే రాచరికం తరహా పాలనకు ఆరంభ సూచికకు ఏడాది క్రితమే బీజం పడింది. నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవన ప్రారంభోత్సవంలో భాగంగా సెంట్రల్ హాలులో 'రాజదండం' (సెంగోల్) ప్రతిష్ఠాపనను కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టం వెనుక పెద్ద కథే ఉందనిపిస్తుంది. ఈ రాజదండాన్ని ప్రధాని మోదీ వేదపండితుల సమక్షంలో రాజ్యాంగ నియమాలను ధిక్కరించి ప్రతిష్ఠించడంపై దేశ వ్యాప్తంగా పెద్ద చర్చే జరిగింది. అవేమీ అధికారంలో ఉన్న వారెవరికీ తలకెక్కలేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన బ్రిటీష్ అధికారి లార్డ్ మౌంట్ బాటెన్ వెళుతూ వెళుతూ అధికార మార్పిడికి చిహ్నంగా భారత తొలి ప్రధాని నెహ్రూకు ఈ రాజదండాన్ని అందించారని కట్టుకథలకు బీజేపీ విస్తృతంగా ప్రచారం ఇచ్చింది. నాడు బ్రిటీష్ పాలకుల నుండి అధికార మార్పిడి జరిగిందని నిరూపించే ప్రయత్నంతో పాటు ఇకపై దేశంలో రాజరికం తరహా పాలనను చూడబోతున్నారనే సంకేతమివ్వడం ఆ తతంగం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.

1947 ఆగస్టు 17 నాటి ఆంధ్రపత్రికలో రాజదండంపై అసలైన నిజాలతో ఒక కథనం ప్రచురించారు. ఆ కథనంలో రాజదండం ఫోటో కూడా ఉంది. దాన్ని మౌంట్ బాటెన్ ఇచ్చినట్టు లేదు. తమిళనాడులోని మఠాధిపతి స్వాతంత్ర్య దినం సందర్భంగా నెహ్రూకు బహూకరించినట్టు ప్రత్యేకంగా రాశారు. ప్రధానిగా ఉన్నవారికి చాలా మంది వివిధ సందర్భాల్లో చాలా బహుమతులు, జ్ఞాపికలు ఇస్తుంటారు. అలా నెహ్రూ చేతికి వచ్చినదే సదరు రాజదండం. అది ఎన్నటికీ అధికార మార్పిడికి చిహ్నం కాజాలదు. పైగా దేశ స్వాతంత్ర్యం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా వివిధ స్రవంతులు జరిపిన ఉద్యమాల ఫలితమే. ఎందరో వీరుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యం కాబట్టే నాటి ప్రధాని నెహ్రూ ఆ సెంగోల్‌ను కానుకగా భావించి మ్యూజియంలో పెట్టమన్నారు. బీజేపీ మాతృక ఆర్‌ఎస్ఎస్‌కు భారత్‌లో రాజరికం తరహా పాలన ఉండాలని కోరుకుంది. రాజ్యాంగం అవసరం లేదని, రాచరికానికి ఆలంబన అయిన మనుధర్మ శాస్త్రం ముద్దు అని వాదించింది కాబట్టే రాజదండం ఉండాలని అసత్యకథనాలు ప్రచారం చేసింది. రాజదండం అంటేనే రాజరికానికి చిహ్నం. రాజరికం ఉన్న చోట ప్రజాస్వామ్యం ఉండదు. ప్రజాస్వామ్యం నశిస్తే రాజ్యాంగమే అమలులో ఉండదు. భారతదేశంలో రాజరిక వ్యవస్థకు నూకలు చెల్లి చాలా కాలమే అయ్యింది. భారత రాజ్యాంగం ఆలంబనగా 75 ఏళ్లకు పైగా నడిచిన స్వాతంత్ర్య భారతంలో మళ్లీ బానిసత్వంతో కూడిన రాజరికం అనే భావనను దేశ ప్రజలు ఎన్నటికీ హర్షించరు. ఈ నేపథ్యంలో పార్లమెంటులోకి చేరిన రాజదండం నిర్దేశించే పాలన దేశానికి తీవ్ర నష్టం చేస్తుంది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌర హక్కులను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు రాజ్యాంగం ఒక్కటే శరణ్యం. బీజేపీ పాలనలో నిత్యం ప్రమాదాలను ఎదుర్కొంటున్న భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజాస్వామిక శక్తులన్నీ కదలాల్సి ఉంటుంది.

సెల్: 9059837847

అద్వాణీకి మళ్లీ అస్వస్థత... ఆసుపత్రిలో చేరిక



న్యూఢిల్లీ: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వాణీ మరోసారి అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం ఆయనను ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేర్చినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. 96 ఏళ్ల అద్వాణీ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. జూన్ చివర్లో కూడా ఆయన అస్వస్థతకు గురవడంతో ఎయిమ్స్‌లో చేర్చారు. యూరాలజీ వైద్యులు ఆయనకు చికిత్స అందించారు. ఆ తర్వాత జులై మొదటివారంలో మరోసారి అనారోగ్యానికి గురవడంతో అపోలో ఆసుపత్రిలో రెండు రోజుల పాటు చికిత్స తీసుకున్నారు. నవంబరు 8న అవిభక్త భారత్‌లోని కరాచీ (ప్రస్తుతం పాక్‌లో ఉంది)లో జన్మించిన అద్వాణీ సుదీర్ఘకాలం పాటు భాజపాలో పనిచేసి రాజకీయ కురువృద్ధుడిగా పేరుగాంచారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆయనను దేశ అత్యున్నత పౌరపురస్కారం 'భారత రత్న'తో సత్కరించిన సంగతి తెలిసిందే.

సీఎం కార్యాలయం పేల్చేస్తామన్న వ్యక్తి అరెస్టు

పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ కార్యాలయానికి బాంబు బెదిరింపు మెయిల్ పంపిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీహార్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని పేల్చివేస్తామని శనివారం నిషిద్ధ ఉగ్రవాద సంస్థ 'అల్-ఖైదా' పేరుతో అధికారులకు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో పోలీసులు తనిఖీలు చేయగా ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీనిపై కేసు నమోదు చేసుకొని మెయిల్ పంపిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా అనుమానితుడిని కోల్‌కతాలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతడిని బీహార్‌లోని బెగుసరాయ్‌కు చెందిన మొహమ్మద్ జాహిద్(51)గా గుర్తించారు. కోల్‌కతాలో పాన్‌షాప్ నడుపుకుంటూ జీవిస్తున్నాడన్నారు. కాగా అతడు బెదిరింపు మెయిల్ ఎందుకు పంపాడనే విషయం ఇంకా తెలియరాలేదని, దీనిపై విచారణ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

సిసోడియా బెయిల్‌పై తీర్పు వాయిదా

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తయింది. సీబీఐ, ఈడీ కేసుల్లో ఆయన బెయిల్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై మంగళవారం (ఆగస్ట్6 న)తో వాదనలు పూర్తి కాగా, కోర్టు తీర్పును వాయిదా వేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సిసోడియా 17 నెలలకు పైగా జైలులో ఉన్నారు. గతంలో ఢిల్లీ కోర్టును ఆశ్రయించినప్పటికీ బెయిల్ లభించలేదు. దీంతో ఆయన సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఇవాళ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. వాదనల సందర్భంగా సిసోడియా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ.. సిసోడియాకు సుదీర్ఘ జైలు శిక్ష కొనసాగించాల్సిన అవసరం లేదని గతంలో సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యల్ని ప్రస్తావించారు. అంతేకాదు... ఒక కేసులో ఛార్జిషీటు వేశాక ఆ వెంటనే వాదనలు మొదలవ్వాలి. కానీ, అలాంటిదేం జరగలేదని.. పైగా సరైన ఆధారాల్ని కూడా ఉంచలేదని సింఘ్వీ బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు.. బెయిల్ ఇవ్వొద్దంటూ సీబీఐ, ఈడీ తరపు న్యాయవాది వాదించారు. దీంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

దేశంలో కుంభవృష్టి

- జనజీవనం అస్తవ్యస్తం
- యూపీలో 9 మంది, రాజస్థాన్‌లో ఐదుగురి మృతి

న్యూఢిల్లీ : రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో నదులు పొంగిపొర్లుతున్నాయి. వరదలు సంభవిస్తున్నాయి. పర్వత రాష్ట్రాలయిన ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో మేఘ విస్ఫోటనం విధ్వంసానికి దారితీసింది. వరదల వంటి పరిస్థితి మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, అనేక ఇతర రాష్ట్రాలలోని ప్రజల రోజువారీ జీవితానికి అంతరాయం సృష్టించింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఏడు జిల్లాల్లో సోమవారం సాయంత్రం వరకు 24 గంటల్లో వర్షాల కారణంగా తొమ్మిది మంది మరణించారని రాష్ట్ర సహాయ కమిషనర్ కార్యాలయం తెలిపింది.

తొమ్మిది రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తన తాజా వాతావరణ బులెటిన్‌లో అల్పపీడనం ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో తూర్పు, వాయువ్య భారతదేశంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, అసోం, మేఘాలయ, మణిపూర్, త్రిపుర, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌కు భారీ వర్షపాతం ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో వారమంతా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్‌లో ఇదే సమయంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే ఆగస్టు 9 వరకు మధ్య మహారాష్ట్ర, పశ్చిమ మధ్య ప్రదేశ్, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలలో, చత్తీస్‌గఢ్, తూర్పు మధ్య ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. గోవా, కొంకణ్, నాగాలాండ్, మిజోరాం, త్రిపుర, అసోం, మణిపూర్, మేఘాలయాతో సహా ఈశాన్య ప్రాంతాలలో ఈనెల 10వ తేదీ వరకు గణనీయమైన వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. బీహార్, తమిళనాడులో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. రాజధాని ఢిల్లీలో మంగళవారం కనిష్ఠ ఉష్ణోగ్రత 26.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఢిల్లీలో 'ఎల్లో అలర్ట్' ప్రకటించింది. ఇదిలాఉండగా, హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా, కాంగ్రా, సిర్మౌర్ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన 'ఆరెంజ్' అలర్ట్‌ను సిమ్లాలోని వాతావరణ కేంద్రం జారీ చేసింది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించడం, కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో 75 రోడ్లను మూసివేశారు. దాదాపు వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కొండ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. కులు, మండి, సిమ్లా జిల్లాల్లో మేఘ విస్ఫోటనం సంభవించిన ఆకస్మిక వరదల్లో 13 మంది మరణించారు. 40 మంది ఆచూకీ ఇప్పటి వరకు లభించలేదు. మరోవైపు, ఉత్తరాఖండ్‌లో 1,400 మందికి పైగా ప్రజలు కేదార్‌నాథ్‌కు వెళ్లే నడక మార్గంలో వర్షాల కారణంగా చిక్కుకుపోయిన వారిని సోమవారం సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారతీయ వైమానిక దళం (ఐఏఎఫ్) కు చెందిన చినూక్, ఎంఐ17 హెలికాప్టర్లు యాత్రికుల తరలింపులో సహాయపడ్డాయని అధికారులను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. 136 మంది యాత్రికులను ఐఏఎఫ్, రాష్ట్ర హెలికాప్టర్లు రక్షించగా, 509 మందిని కేదార్‌నాథ్ నుంచి కాలినడకన లించోలికి తీసుకువచ్చి హెలికాప్టర్లలో చార్ధామ్, షెర్సీ హెలిప్యాడ్‌లకు పంపినట్లు విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ తెలిపారు. గత గురువారం సహాయక చర్యలు ప్రారంభించినప్పటి నుంచి 11,775 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఏడు జిల్లాల్లో వర్షాల కారణంగా తొమ్మిది మంది మరణించారని రాష్ట్ర సహాయ కమిషనర్ కార్యాలయం తెలిపింది. ఏడుగురు నీట మునిగి చనిపోగా, ఇద్దరు పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. పాముకాటు కారణంగా బందా, ప్రతాప్‌గఢ్ జిల్లాల్లో మరణాలు నమోదవగా, షామ్లీ, ఖుషీనగర్, బలరామ్‌పూర్, చిత్రకూట్‌లో వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. రిలీఫ్ కమిషనర్ జి.ఎస్.నవీన్ కుమార్ మాట్లాడుతూ 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలో 3.7 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని తెలిపారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సగటు వర్షపాతం 344.7 మిల్లీమీటర్లు నమోదయింది.

రాజస్తాన్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా, ఒకరు గల్లంతయ్యారని పోలీసు తెలిపారు. వాతావరణ శాఖ ప్రకారం, రాజస్తాన్‌లోని టోంక్, పాలి, బుండి, భిల్వారా జిల్లాల్లో గత 24 గంటల్లో భారీ వర్షాలు కురిశాయి. జోధ్‌పూర్‌లోని బోరనాద ప్రాంతంలో ఫ్యాక్టరీ గోడ కూలిపోవడంతో 13 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వీరిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పాలీలో ఒక ద్విచక్ర వాహనదారుడు బలమైన ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందాడు. సోజత్ ప్రాంతంలో కచ్చా ఇల్లు కూలిపోవడంతో గీతాదేవి మృతి చెందిందని వారు తెలిపారు. తన స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లిన ఓ వ్యక్తి సెల్ఫీ తీసుకుంటూ భిల్వారాలోని బిజోలియాలోని మెనాల్ జలపాతంలో 150 అడుగుల కింద పడిపోయాడు. అతని ఆచూకీ ఇంకా లభించలేదని, గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. అసోం రాజధాని గుహాటిలో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి అనేక ప్రాంతాలు నీట మునిగాయి. షిల్లాంగ్‌కు వెళ్లే రహదారిపై వరద నీరు చేరడంతో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ అంతరాయాల్లో గంటల తరబడి చిక్కుకున్న ప్రయాణికులు, విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. దీంతో అన్ని విద్యాసంస్థలను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కర్నాటక రాష్ట్రం బెంగళూరులోని అనేక ప్రాంతాలు భారీ వర్షానికి నీట మునిగాయి. నగరంలోని నాగవర, హెబ్బాల్ మధ్య ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం (కేఐఏ) కూడలి, అలాగే నగరంలోని అనేక ప్రాంతాల్లో వరద నీరు చేరింది. కెంపెగౌడ విమానాశ్రయానికి వెళ్లే ట్రాఫిక్‌కు కూడా అంతరాయం ఏర్పడింది. ఉత్తర కేరళ జిల్లాలో భారీ కొండచరియలు విరిగిపడి వందలాది మంది మరణించిన వారం తర్వాత మంగళవారం శోధన కార్యకలాపాలు ముమ్మరం అయ్యాయి. చాలియార్ నదీ పరీవాహక ప్రాంతంలో హెలికాప్టర్‌లో ప్రత్యేక బృందంతో మృతదేహాలు లేదా అవశేషాల కోసం గాలింపు చేపట్టినట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. జిల్లా కలెక్టర్ మేఘశ్రీ డిఆర్ విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల సమీపంలోని నది, గ్రామం, దిగువ ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించామని వివరించారు.

మాపై ఎంత ఒత్తిడి ఉందో అర్థం చేసుకోవాలి

సీజేఐ అసహనం

న్యూఢిల్లీ: కొంతమంది సుప్రీంకోర్టు న్యాయవాదులపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) చంద్రచూడ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోర్టులు, న్యాయమూర్తులపై ఎంత ఒత్తిడి ఉందో కనీసం అర్థం చేసుకోవాలని సీజేఐ అన్నారు. న్యాయవాదులు ఒక రోజు సీజేఐ స్థానంలో కూర్చుంటే ఎంత ఒత్తిడితో పని చేస్తున్నామో అన్న విషయం తెలుస్తుందని చంద్రచూడ్ అన్నారు. ఒక్క రోజు తమ స్థానంలో కూర్చుంటే... మళ్లీ జీవితంలో ఆ స్థానంలోకి రాకుండా పారిపోతారని సీజేఐ వ్యాఖ్యానించారు. ముంబై చెంబుర్ కాలేజీలో విద్యార్థినుల బురఖా, హిజాబ్ రద్దు చేసిన వ్యవహారంపై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరూ తమ కేసు ముందుగా విచారణ చేపట్టాలని కోరుతున్నారని... కానీ న్యాయమూర్తుల మీద ఉన్న ఒత్తిడిని ఎవరూ పట్టించుకునే పరిస్థితుల్లో లేరని తెలిపారు. ప్రతి ఒక్క పిటిషన్‌పై విచారణ చేస్తామని... దానికి ఒక తేదీని ఇస్తామన్నారు. ఆ విషయాన్ని అర్థం చేసుకోవాలి కానీ న్యాయమూర్తులను, కోర్టును శాసించవద్దు అని జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. ముంబైకి చెందిన చెంబూర్ కళాశాల యాజమాన్యం కళాశాల ప్రాంగణంలో హిజాబ్, బుర్కా, నఖాబ్‌లపై నిషేధం విధించింది. దీనిపై కొందరు విద్యార్థులు బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. న్యాయమూర్తులు ఎఎస్ చందూర్కర్, రాజేష్ పాటిల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కళాశాల తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని తెలిపారు. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

'ఉద్యోగానికి భూమి' కేసులో లాలూకు షాక్

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్ (ఉద్యోగాల కొరకు భూమి కుంభకోణం) కేసులో ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కు మరో షాక్ తగిలింది. లాలూతో పాటు ఆయన తనయుడు తేజస్వి, మరో ఎనిమిది మందిపై ఈ కేసులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలైంది. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రౌస్ అవెన్యూ కోర్టులో 96 పేజీల డాక్యుమెంట్లను సమర్పించింది. ఢిల్లీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌పై ఆగస్టు 13న వాదనలు వినిపించేందుకు జాబితా చేశారు. కాగా, జనవరిలో సైతం ఈడీ బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్డీ దేవి, ఆమె కుమార్తెలు ఎంపీ మీసా భారతి, హేమా యాదవ్‌తో పాటు వ్యాపారవేత్త అమిత్ కత్యాల్, మాజీ రైల్వే ఉద్యోగి హృదయానంద్ చౌదరిలను నిందితులుగా పేర్కొంటూ ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. 2004 నుంచి 2009 వరకు లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో పలువురు అభ్యర్థుల వద్ద భూమిని లంచంగా తీసుకొని రైల్వే ఉద్యోగాల ఇప్పించారనే ఆరోపణలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ కేసులో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది.

ప్రజల్లోకి బీజేపీ, జేడీయూ నేతల నిర్వాకం: డీకే

బెంగళూరు: కాంగ్రెస్ జన్ ఆందోళన యాత్రలో బీజేపీ, జేడీయూ నేతలే లక్ష్యంగా కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విమర్శలు గుప్పించారు. హెచ్‌డీ కుమారస్వామి, బీఎస్ యడియూరప్ప సహా విపక్ష నేతలు గతంలో చేసిన ప్రకటనల వీడియోను ప్రదర్శించారు. తాము రాజకీయ కోణంలోనే ఇలా చేస్తున్నామని కాషాయ నేతలు అనుకోవచ్చు కానీ అది వాస్తవం కాదన్నారు. వారు ఏం మాట్లాడారనేదే తాము చూపామని చెప్పారు. ప్రధాని మోదీ కేవలం అయిదు నిమిషాల్లోనే మేకేదాటు ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చేలా చూస్తానని కుమారస్వామి చెప్పిన విషయాన్ని డీకే శివకుమార్ గుర్తుచేశారు. కుమారస్వామి గురించి యడియూరప్ప ఏం మాట్లాడారు, బీజేపీ, ప్రధానమంత్రిని ఉద్దేశించి కుమారస్వామి ఏం మాట్లాడారనేది తాను చూపాలని అనుకున్నానని చెప్పారు. కాగా, కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అవినీతికి పాల్పడుతోందని ఆరోపిస్తూ బీజేపీ-జేడీఎస్ చేపట్టిన చలో మైసూర్ పాదయాత్రపై కర్నాటక మంత్రి డాక్టర్ శరణ్ ప్రకాష్ పాటిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారు పాదయాత్ర చేయడం లేదని పశ్చాత్తాప యాత్ర చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పాటిల్ మంగళవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కర్నాటకలో అవినీతిని ప్రారంభించిందే కాషాయ నేతలని దుయ్యబట్టారు. ఈ విషయంలో తాము ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. బీజేపీ నేతలు తాము చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే పాదయాత్ర పేరిట హంగామా చేస్తున్నారని మంత్రి డాక్టర్ శరణ్ ప్రకాష్ పాటిల్ ఆరోపించారు. అవినీతిలో నిండా మునిగిన కాషాయ నేతలు తాము అధికారం కోల్పోగానే ఇప్పుడు అవినీతి జరుగుతోందని గగ్గోలు పెడుతున్నారని మంత్రి బీజేపీ నేతలను ఎద్దేవా చేశారు.

ముంబైలోని ఏ స్థానాన్ని వదులుకోం: ఆప్

ముంబై: మహారాష్ట్రలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ముంబైలోని మొత్తం 36 సీట్లలో పోటీ చేస్తుందని ఆ పార్టీ మంగళవారం ప్రకటించింది. ముంబైలోని అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటికే సమాయత్తమయ్యాయని ఆప్ ముంబై చీఫ్ ప్రీతి శర్మ మీనన్ తెలిపారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో జాతీయ పార్టీగా ఎదిగిన ఆప్ ఇప్పటికే ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను విజయవంతంగా నడుపుతున్నదని చెప్పారు. తమకు గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలున్నారని, పార్లమెంట్‌కు గణనీయ సంఖ్యలో ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని అన్నారు. పదేండ్లలోనే ఢిల్లీ తరహా అభివృద్ధి మోడల్‌ను ఆప్ దేశానికి పరిచయం చేసిందని చెప్పారు. నాణ్యమైన విద్య, వైద్యం, మంచినీరు, విద్యుత్ సరఫరా వంటివి ఉచితంగా అందించడమే కాకుండా అవినీతి లేకుండా చూసిందని తెలిపారు. ఢిల్లీ, పంజాబ్ మోడల్‌తో ఆప్ స్వచ్ఛమైన రాజకీయాలు, నూతన రాజకీయ సంస్కృతిని దేశవ్యాప్తంగా విస్తరించే ప్రక్రియతో ముందుకెళుతుందని ప్రీతి శర్మ పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు రాబడతామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

రాష్ట్రపతికి ఫిజీ అత్యున్నత పురస్కారం ప్రదానం

న్యూఢిల్లీ: ఫిజీ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు రతు విలియమ్ మైవలిలీ కటోనివేర్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రస్తుతం ఫిజీ దేశ పర్యటనలో ఉన్న ముర్ము ఈ అవార్డుని అందుకున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం అధికారిక 'ఎక్స్' లో వెల్లడించింది. ఫిజీ పార్లమెంటును ఉద్దేశించి ముర్ము మాట్లాడుతూ.. ఫిజీని బలమైన. సంపన్నమైన దేశంగా మార్చేందుకు భారత్ అండగా నిలుస్తుందన్నారు. దీంతో రెండు దేశాల ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. దాదాపు 10 ఏళ్ల క్రితం ఫిజీ పార్లమెంటులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడిన మాటలను గుర్తుచేశారు. ద్వీపదేశమైన ఫిజీలో భారతదేశ రాష్ట్రపతి పర్యటించడం ఇదే తొలిసారి. అంతకుముందు గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించిన భారతీయ సోలరైజేషన్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్ రెసిడెన్స్ ప్రాజెక్టు పురోగతిని ముర్ము పరిశీలించారని రాష్ట్రపతి కార్యాలయం వెల్లడించింది. ముర్ము ఫిజీ పర్యటన అనంతరం న్యూజిల్యాండ్, తిమోర్- లెస్ట్‌లలో పర్యటించనున్నారు.

అమెరికా మహిళను బంధించిన కేసులో కొత్త కోణం

ముంబై: మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో అమెరికాకు చెందిన ఓ మహిళను గొలుసులతో కట్టిపడేసిన ఘటనలో కొత్త పరిణామం చోటుచేసుకుంది. పోలీసుల వాంగ్మూలంలో అమెరికన్ మహిళ తనకు తాను సంకెళ్లు వేసుకున్నానని, మరెవరి ప్రమేయం లేదని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. జులై 27 న సింధుదుర్గ్ జిల్లాలోని అటవీ ప్రాంతమైన సోనుర్లి గ్రామ శివార్లలో ఇనుప గొలుసులతో మహిళను చెట్టుకు కట్టేశారు. అయితే ఆ ప్రాంతానికి వెళ్లిన పశువు కాపరికి మహిళ బిగ్గరగా కేకలు వేస్తూ కనిపించారు. దీంతో పశువుల కాపరి అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కట్టేసిన గొలుసుల్ని విడిపించారు. అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ఆమె పలు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. శనివారం (ఆగస్టు 3) సింధుదుర్గ్ పోలీసులు మహిళ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ సమయంలో ఆమె మూడు తాళాలు, ఇనుప గొలుసులతో ముంబై నుంచి 460 కిలోమీటర్ల దూరంలోని సోనుర్లి గ్రామ సమీపంలోని అడవిలోకి వెళ్లినట్లు, తాను అక్కడనున్న ఓ చెట్టుకు కట్టుకున్నట్లు తెలిపారు. ఆమెను ఎన్ని రోజులు చెట్టుకు కట్టివేసిందనే దానిపై ఇంకా స్పష్టత లేదని ఆయన చెప్పారు. ఇక మహిళ వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా.. ఆమె బ్యాగ్‌లో అమెరికా పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, ఇతర డాక్యుమెంట్లు ఉన్నాయి. ఆమెను తమిళనాడుకు చెందిన లలితా కయీగా గుర్తించిన పోలీసులు..తమిళనాడు పోలీసులకు సమాచారం అందించారు. తదుపరి విచారణ కొనసాగుతోంది.

80 మంది విద్యార్థులకు అస్వస్థత

డియోరియా : ఫుడ్ పాయిజన్ కారణంగా సుమారు 80 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని డియోరియా జిల్లాలో ఆదివారం చోటు చేసు కోగా...ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలోని మోహరూనా గ్రామంలోగల పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆశ్రమ్ మెథడ్ ఇంటర్ కాలేజీలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి ఆహారం తిన్న సుమారు 80 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. కళాశాల అధికారులు విద్యార్థులను మహర్షి దేవర్హ బాబా మెడికల్ కాలేజీకి తరలిం చి చికిత్స అందించారు. ప్రస్తుతం అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇద్దరు విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దివ్య మిట్టల్‌తోపాటు ఎస్పీ ఆశ్రమ కాలేజీకి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. ఆశ్రమంలోని వంటశాలలో ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహారాన్ని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. నివేదిక వచ్చిన వెంటనే.. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులతో రాజకీయాలా?: ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ పాఠ్యపుస్తకాల నుంచి రాజ్యాంగ ప్రవేశికను తొలగించారని కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎన్‌సీఆర్‌టీ పుస్తకాల్లో తొలిసారిగా రాజ్యాంగ ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, జాతీయ గీతానికి తాము తగిన ప్రాముఖ్యతను, గౌరవాన్ని ఇచ్చామన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం..విద్యార్థుల వయసును దృష్టిలో పెట్టుకొని ఈ అంశాలను పాఠ్యపుస్తకాలలో చేర్చామన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ తన రాజకీయాల కోసం విద్యార్థులను వాడుకుంటోందని, భారతదేశ అభివృద్ధిని, విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని మంత్రి ఆరోపించారు. రాజ్యాంగ పీఠిక మాత్రమే రాజ్యాంగ విలువలను ప్రతిబింబిస్తుందన్న కాంగ్రెస్ వాదన రాజ్యాంగంపై వారికి ఉన్న అవగాహన లోపాన్ని వెల్లడిస్తోందని పేర్కొన్నారు. ముందు నుంచి కూడా కాంగ్రెస్ దేశంలో విద్యా వ్యవస్థ అభివృద్ధిని వ్యతిరేకిస్తూ వస్తోందన్నారు. రాజ్యాంగంపై కపట ప్రేమను నటిస్తూ రాజ్యాంగ ప్రతులను పట్టుకొని తిరుగుతున్న వారి పూర్వీకులే రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాశారని ఆరోపించారు.

కేజ్రీవాల్ ఆలోచనల్ని నిర్బంధించలేరు : భగవంత్ మాన్

చండీగఢ్: కేంద్రంలోని మోదీ సర్కార్... ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై తప్పుడు కేసు బనాయించి అన్యాయంగా జైలుకు పంపిందని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మండిపడ్డారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు కానీ ఆయన ఆలోచనలను మీరు ఎలా నిర్బంధిస్తారని ప్రశ్నించారు. హోషియార్పూర్‌లో భగవంత్ మాన్ మంగళవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేజ్రీవాల్ సిద్ధాంతాన్ని విశ్వసించే కోట్లాది ప్రజలను మీరు ఏం చేస్తారని నిలదీశారు. ప్రజలను నిరంకుశంగా అణిచివేస్తే వారు కొన్నేళ్ల పాటు మౌనం దాల్చవచ్చని కానీ 20 ఏండ్ల అనంతరం వారు మేల్కొంటే ఏం జరుగుతుందో ఇవాళ బంగ్లాదేశ్‌లో చూస్తున్నామని చెప్పారు. ప్రజల ఆగ్రహం కట్టలుతెంచుకోవడంతో బంగ్లాదేశ్ ప్రధాని తన పదవికి రాజీనామా చేసి అరగంటలోనే పారిపోయారని చెప్పారు. ప్రధాని నివాసం నుంచి ప్రజలు వస్తువులను తీసుకువెళ్లారని చెప్పారు. దీర్ఘకాలం ప్రజలను వేధిస్తే ఇదే జరుగుతుందని హెచ్చరించారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలని, కానీ మీరు మీ సొంత కుటుంబాలకు మేలు చేయడంలో తలమునకలయ్యారని, ఇందుకు బంగ్లాదేశ్ ఉదంతమే గొప్ప పాఠమని భగవంత్ మాన్ అన్నారు.

మోసం కేసులో వ్యాపారవేత్త అరెస్ట్

తిరువనంతపురం: కేరళకు చెందిన వ్యాపారవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత సుందర్ సి.మీనన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్థిక మోసం కేసులో ఆయనపై ఆరోపణలు వచ్చినట్లుగా తెలిపారు. కోర్టు రిమాండు అనంతరం జైలుకు తరలించినట్లుగా పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పలు సంస్థలకు డైరెక్టర్‌గా వ్యవహరించే సుందర్ సి.మీనన్, మరి కొందరు తమ సంస్థల పేరుపై 62మందికి పైగా ఇన్వెస్టర్ల నుంచి రూ.7.78కోట్ల డిపాజిట్లు తీసుకొని, స్కీమ్ మెచ్యూరిటీ వ్యవధి తర్వాత డబ్బులు చెల్లించకుండా మోసం చేశారని ఆరోపించారు. కాగా వివిధ సెక్షన్ల కింద 18 కేసులు నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు. క్రైమ్ బ్రాంచ్ అధికారులు కేసును దర్యాప్తు చేస్తారని పేర్కొన్నారు. కాగా సుందర్ సి.మీనన్ 2016లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు.

సీపీఐ బలోపేతమే లక్ష్యం

విశాలాంధ్ర-బెలగాం: ప్రజల్ని చైతన్యపర్చే పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం స్థానిక బెలగాం గిరిజన భవన్ లో జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జల్లి విల్సన్ మాట్లాడుతూ... ఉద్యమాలకు నిలయమైన పార్వతీపురం మన్యం జిల్లాలో పార్టీ క్యాడర్‌ను పెంచాలని నాయకులకు సూచించారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేసే విధంగా పార్టీ కార్యకర్తలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యకర్తలంతా నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజలకు పార్టీ గురించి చెప్పాలన్నారు. గ్రామ స్థాయిలో సీపీఐని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రంలో సీపీఐ ప్రతిపక్ష పాత్ర పోషిస్తోందని తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న కార్యకర్తలు, నాయకులంతా ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో నవంబర్ 28, 29, 30 తేదీలలో ఏఐఎస్ఎఫ్ మహాసభలు జరుగనున్నాయని, దీనికి అన్ని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, పార్టీ

జల్లి విల్సన్

శాఖల నాయకులు హాజరై విజయవంతం చేయవలసినదిగా కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు మాట్లాడుతూ... రానున్న కాలంలో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీపీఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా కృషి చేయాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. జీవన్న మాట్లాడుతూ ఏనుగుల సమస్య, అధ్వాన్న రోడ్లు, గుమ్మలక్ష్మీపురం మండలంలో ఇళ్ల స్థలాలపైన సీపీఐ తరపున ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొచ్చ మోహనరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ జనార్దన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవి నాయుడు, బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, కె.గోపి నాయుడు, జిల్లా సమితి సభ్యులు సాలాపు అనంతరావు, బి.బంగార్రాజు, సింహాద్రి దుర్గారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బీటీ నాయుడు, పార్టీ నాయకులు గెంబలి శ్రీనివాసరావు, రాగోలు దుర్గా ప్రసాద్, గోవిందరావు, జె.సూకరాజు, జి.మోహన్ రావు, ఎ.అప్పారావు, ఆర్.ముత్యాలు, మహిళా సమాఖ్య నాయకులు చింతాడ అన్నపూర్ణ, నాగవంశం జానకమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల శ్రేయస్సే మోదీకి ముఖ్యం

జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర-నర్సీపట్నం (అనకాపల్లి): ప్రధాని నరేంద్ర మోదీకి కార్పొరేట్ల శ్రేయస్సే తప్ప దేశంలో పేద, సామాన్య, రైతుల సమస్యలు పట్టవని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి దుయ్యబట్టారు. ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టి వేధించడమే మోదీ ప్రధాన అజెండా అని విమర్శిం చారు. మంగళవారం సీపీఐ అనకాపల్లి జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన నర్సీపట్నంలోని శ్రీకృష్ణ ప్యాలెస్ లో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఆదేశాలకు అనుగుణంగా కేంద్రంలో పాలన జరుగుతోందన్నారు. 2029 వరకు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉండే అవకాశం లేదన్నారు. మణిపూర్ రావణ కాష్టంలా రగులుతూనే ఉందన్నారు. దేశంలో మీడియా మొత్తం ప్రజా సమస్యల్ని వదిలేసి అంబానీ కుమారుడు వివాహం గురించి గొప్పగా చూపించడం దుర్మార్గం అన్నారు. మాజీ సీఎం జగన్ ప్రజలతో మమేకం కాకుండా ఇనుపకంచెలు, పరదాలతో ప్రయాణించారని... కొన్ని సంక్షేమ పథకాలు తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. విద్యావ్యవస్థను గందరగోళం లో పడేశారని, ఉద్యోగ కల్పన లేదని, కరోనా లాక్ డౌన్ లో కూడా బ్రాందీ షాపుల వద్ద టీచర్లకు బాధ్యతలు అప్పజెప్పిన ఘనుడు జగన్ అని మండి పడ్డారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన చంద్రబాబు శ్వేత పత్రాలతో ధరల భారాన్ని ప్రజలపై రుద్దడానికి సమాయత్తమవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ నిరంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల హక్కుల కోసం సీపీఐ పోరాడిందన్నారు. 2025 డిసెంబర్ 25 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఉద్యమ పార్టీ సీపీఐని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. దేశంలో నిరుద్యోగం, దోపిడీ, పీడన ఉన్నంతకాలం ఎర్రజెండా ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వివిధ వర్గాల ప్రజా సమస్యలపై పోరాడిన ఘనత సీపీఐదేనన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిసారిగా పిలుపు ఇచ్చింది కూడా భారత కమ్యూనిస్టు పార్టీయేనని తెలిపారు. నాటి నుండి నేటి వరకు దున్నేవాడిదే భూమి అనే నినాదంతో పేదలకు భూ పంపిణీ చేసిందన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలియజేస్తూ... గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు రావు జగ్గారావు, అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, టౌన్ పార్టీ సెక్రటరీ గొల్లు గురు బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు డీసీహెచ్ క్రాంతి, బి. సుబ్బలక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ విపత్తు బాధితులకు ఫ్రెండ్స్ ఫోరం రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకృతి ప్రకోపానికి గురైన కేరళలోని వయనాడ్ జిల్లాలో బాధితులకు తమ వంతు చేయూతగా ఫ్రెండ్స్ ఫోరం లక్ష రూపాయలు విరాళంగా అందజేసింది. ఈ మొత్తాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కేరళ రాష్ట్ర సమితికి ఫ్రెండ్స్ ఫోరం ప్రతినిధులు పంపించారు. లక్ష విరాళంగా పంపిన ఫ్రెండ్స్ ఫోరం సభ్యులకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు

- అవినీతి... అహంకారం... నియంతృత్వం ఉండకూడదు
- పోరాట కేంద్రాలుగా కమ్యూనిస్టు కార్యాలయాలు
- సీపీఐ నేతలు నారాయణ, కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - భద్రాద్రి కొత్తగూడెం: రాజకీయాల్లో ఎప్పటికీ ప్రతిపక్షాలు ఉంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని, సామాన్య ప్రజలకు సైతం న్యాయం అందుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. దేశ ప్రజలు కూడా నేడు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారని, కమ్యూనిస్టు కార్యాలయాలు పోరాట కేంద్రాలుగా ఉండి ప్రజలకు సైతం భరోసా కల్పించాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలంలోని బాబు క్యాంప్ ఏరియాలోని సీపీఐ కార్యాలయాన్ని (రజబ్ అలీ భవన్) ఆయన మంగళ వారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఎగుర వేశారు. కార్యదర్శి కార్యాల యాన్ని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, చంద్ర సత్యం , సమావేశ మందిరాన్ని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతా రామయ్య ప్రారంభిం చారు. అనంతరం జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ అవినీతి, నియంతృత్వం, అహంకార ధోరణులు నేటి రాజకీయాల్లో సహజమై పోయాయని, ఈ విధానాలు ఎప్పటికీ ఏ వ్యక్తికైనా, రాజకీయా ల్లోనైనా ఎక్కువకాలం మనుగడ సాగించ లేవని స్పష్టం చేశారు. సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే అమరజీవి రజబ్ అలీ కాలం నాటి రాజకీయాలకు, ప్రస్తుత రాజకీయాలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. నిబద్ధత, పవిత్రమైన రాజకీయాలు నేడు అపహాస్యం పాలవుతున్నాయని, నరేంద్ర మోదీ పదేళ్ల కాలంగా ప్రతిపక్షాలపై బెదిరింపు, బ్లాక్ మెయిల్, నియంతృత్వ విధానాలతో పాలన సాగిస్తున్నారన్నారని దుయ్యబట్టారు. తెలంగాణ, ఏపీల్లో మోదీ తరహాలోనే అవినీతి, నియంతృత్వం, అహంకారానికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రతి పక్షాలను అగౌరవ పరిచే సాంప్రదాయాన్ని మానుకోవాలని అధికార రాజకీయ నేతలకు నారాయణ హితవు పలికారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తప్పిదాన్ని చేస్తోందని, తీరు మార్చు కోవాలని సూచించారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజా తీర్పునకు ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందే అని చెప్పారు. ఎలాంటి పదవులు లేకున్నా కమ్యూనిస్టులు నిత్యం ప్రజలతోనే ఉంటారని స్పష్టం చేశారు. దేశంలో పరిస్థితులు చూస్తుంటే ప్రజలు ఇప్పుడిప్పుడే కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారని అన్నారు. పవిత్రమైన రాజకీయ వ్యవస్థను కాపాడుకునేందుకు కమ్యూనిస్టులుగా పోరాటాలను మరింత పదునుపెట్టాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేయడంతో దాదాపు 40 ఏళ్ల గా ఈ ప్రాంతం కమ్యూనిస్టుల కంచుకోటగా నిలిచిందన్నారు. ఎన్నో నిర్బంధాలు, జైళ్లు, అణచివేతలను తట్టుకుని నిలబడ్డామ న్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడే పార్టీల మనుగడ శాశ్వతమ న్నారు. తమకు పదవుల కంటే ప్రజా శ్రేయస్సు ముఖ్యమని కూనంనేని స్పష్టం చేశారు. సీపీఐ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు ఎస్ కె.సాబీర్ పాషా, పోటు ప్రసాద్, వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి శీతారామయ్య, కే రాజ్ కుమార్ మాట్లాడారు.

బంగ్లా పరిస్థితులను గమనిస్తున్నాం

కేంద్ర మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ పరిణామాలపై రాజ్యసభలో విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, ఢాకాలోని భారత్ దౌత్య కార్యాలయం ద్వారా పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. దేశంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆర్మీ చీఫ్ ప్రకటించిన నేపథ్యంలో అక్కడ త్వరలోనే పరిస్థితులు సాధారణ స్థితికి వస్తాయని భావిస్తున్నట్లు చెప్పారు. బంగ్లాదేశ్‌లో 19వేల మంది భారతీయులు ఉన్నారని జైశంకర్ వెల్లడించారు. వీరిలో 8వేల మంది విద్యార్థులు ఇప్పటికే భారత్ చేరుకున్నారని తెలిపారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీల వ్యాపారాలపై దాడులు జరుగుతున్నాయని, మైనార్టీల రక్షణకు అక్కడున్న సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఢాకాలోని అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించి అన్ని వివరాలు అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు. 'బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. ఆమె షార్ట్ నోటీసుతో ఇండియాకు వచ్చారు. బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగ డంతో షేక్ హసీనా రాజీనామా చేయాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో భారతీయ యువకులు వెనక్కి రావాలనుకుంటు న్నారు. భారతీయ యువకులను వెనక్కి రప్పించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. బంగ్లాదేశ్‌లోని భారతీయులు, మైనారిటీల భద్రతపై అక్కడి ఆర్మీతో మేము టచ్‌లో ఉన్నాం. అక్కడి శాంతి భద్రతలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం' అని తెలిపారు.

హాస్టళ్లలో మౌలిక వసతుల కోసం

ఉద్యమించిన విద్యార్థిలోకం

నినాదాలతో మార్మోగిన కలెక్టరేట్లు

విశాలాంధ్ర-విజయవాడ/ అనంతపురం/గుంటూరు: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యాన విద్యార్థులు ఉద్యమించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల వసతి గృహాలోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతోపాటు జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో మంగళవారం వివిధ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతపురంలో దాదాపు ఐదువేల మంది విద్యార్థులతో కలెక్టరేట్ దగ్గర మహాధర్నా నిర్వహించారు. సమస్యలపై విద్యార్థుల నినాదాలతో కలెక్టరు కార్యాలయ ప్రాంతం మారుమోగింది. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వందలాది మందితో ధర్నా జరిగింది. విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కనీసం విద్యార్థులకు మరుగుదొడ్లుగాని స్నానపు గదులుగాని లేని పరిస్థితి నెలకొందన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్ మాట్లాడుతూ, అద్దె భవనాలలో నడుస్తున్న హాస్టళ్లకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీశ్, నాయకులు సుధీర్, అయ్యప్ప, సురేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాన్సన్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు గత ఏడు సంవత్సరాల నుంచి ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. నెల రోజుల్లో సమస్యలను పరిష్కరించకుంటే చలో సచివాలయానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాశం వెంకటేష్, బందెల నాసర్ జీ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని కోడిగుడ్ల సత్రంలో సమీకృత సంక్షేమ హాస్టల్ భవనానికి కోటి రూపాయలు కేటాయించి తక్షణమే పూర్తి చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, శివ నాగరాజు, అఖి, నవ్యశ్రీ, కిరణ్, డేవిడ్, అమర్నాథ్, అజయ్, వెంకటేశ్, బన్నీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో భారీ ధర్నా: అనంతపురంలో జరిగిన మహాధర్నాను ద్దేశించి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుల్లాయిస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ లో విద్యకు నిధులు పెంచాలన్నారు. ప్రభుత్వం హాస్టల్లో చదువుకుంటున్నా విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని అనేక సమస్యలపై ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా సమరశీల పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పెడుతున్నాయన్నారు. అందుకే నేడు వేలాది మంది విద్యార్థులు కలెక్టరు కార్యాలయ ముందు మహాధర్నాకు పూనుకున్నారన్నారు. సమస్యల పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం ఆగదని విద్యార్థుల సత్తా ఏమిటో ప్రభుత్వాలకు తెలిసే విధంగా పోరాటాలు వుంటాయన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు రమణయ్య, కోశాధికారి హనుమంతు, ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్ వంశీ, సహాయ కార్యదర్శులు వెంకట్ నాయక్, ఆంజనేయులు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, చిరుతల ఉమామహేష్ తదితరులు నాయకత్వం వహించారు.

జర్నలిస్టుల డిమాండ్లపై త్వరలో చలో ఢిల్లీ

ఐజేయూ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో నిర్ణయం

హైదరాబాద్/ చండీగఢ్: వర్కింగ్ జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి ఢిల్లీలో త్వరలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమం చేపట్టాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) నిర్ణయించింది. హర్యానాలోని పంచకులలో ఆగస్టు 3-4 తేదీలలో జరిగిన ఐజేయూ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో మీడియా స్వేచ్ఛ పరిరక్షణ, మీడియా స్థితిగతులు, జర్నలిస్టుల భద్రత వంటి విషయాలపై సమగ్రంగా చర్చ జరిగిందని అధ్యక్షుడు కే శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. చండీగఢ్, హర్యానా జర్నలిస్ట్ యూనియన్ ఈ సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చింది. దేశంలో మీడియా రంగంలో సాంకేతికత పెరగడం, కృత్రిమ మేధను వినియోగించడం, డిజిటల్ మీడియా విస్తరణ నేపథ్యంలో మీడియా స్థితిగతుల అధ్యయనానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఐజేయూ చిరకాలంగా డిమాండ్ చేస్తున్నదని అయితే ప్రభుత్వం తమ డిమాండును పెడచెవిన పెడుతున్నదని ఆ ప్రకటనలో వారు విచారం వ్యక్తం చేశారు.

జర్నలిస్టులపై దాడుల నిరోధానికి ప్రత్యేకచట్టం తేవాలని, వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్‌ను, వేజ్ బోర్డ్‌ను, రైల్వే రాయితీ పాస్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని, ప్రెస్ కౌన్సిల్‌ను మీడియా కౌన్సిల్‌గా మార్చాలని చాలా కాలంగా ఐజేయూ డిమాండ్ చేస్తున్నది. అయితే కేంద్ర ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. జర్నలిస్టులు దశలవారీగా దేశవ్యాప్తంగా వివిధ రూపాలలో ఆందోళనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వ స్పందన లేకపోవడంతో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని ఐజేయు జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్ణయించిందని శ్రీనివాస్ రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్మూ ఆ ప్రకటనలో తెలిపారు. త్వరలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల నుంచి జర్నలిస్టులను సమీకరించాలని ఐజేయూ సమావేశం నిర్ణయించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. "చలో ఢిల్లీ" కార్యక్రమం జరిపే తేదీని ఐజేయూ నాయకత్వం త్వరలో నిర్ణయిస్తుందని వారు వెల్లడించారు. ఐజేయూ అధ్యక్షుడు కే శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నేషనల్ కౌన్సిల్ సమావేశంలో 18 రాష్ట్రాలకు చెందిన రెండువందల మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఆరు ప్రధాన డిమాండ్లపై జాతీయ కౌన్సిల్ సమావేశం తీర్మానాలను ఆమోదించింది. దేశంలో జర్నలిస్టులపైన, మీడియా సంస్థల మీద దాడులు పెచ్చరిల్లడంపై సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జర్నలిస్టుల రక్షణకు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ప్రత్యేక చట్టాలు చేయడంపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది. జాతీయస్థాయిలోనూ, రాష్ట్రాలలోనూ వెంటనే ఇటువంటి చట్టాలు తేవాలని ఒక తీర్మానంలో ఐజేయూ డిమాండ్ చేసింది. కార్మిక చట్టాల కోడిఫికేషన్ పేరిట రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్‌ను, వేజ్ బోర్డును, పునరుద్ధరించాలని మరో తీర్మానంలో ఐజేయూ డిమాండ్ చేసింది. దేశంలో బలమైన వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమాన్ని నిర్మించడపై యూనియన్ కేంద్రీకరించి పనిచేస్తున్నదని వారు తెలిపారు.





Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.